ప్రజాశక్తి

సోమవారం 25 ఆగస్టు 2025 8 పేజీలు





గుంటూరు పల్నాడు

ఫార్సుగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

యథేశ్చగా వినియోగం-పట్టించుకోని అధికార గణం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



జిల్లాలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులపై నిషేధం పక్కాగా అమలు చేస్తామని అధికారులు,ప్రజా ప్రతినిధుల ప్రకటనలు మాటలకే పరిమితం అయ్యాయి. ఆగస్టు ఒకటి నుంచి పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. కానీ ఎక్కడా అమలు కావడం లేదు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు యథేశ్చగా వినియోగం, విక్రయం జరుగుతోంది. అక్టోబరు 2 నుంచి పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ పై నిషేధం అమలు కావాలని ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు ఇచ్చింది. ఈనేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ఆగస్టు ఒకటి నుంచి అమలు చేస్తున్నట్టు అధికారులు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. కానీ అమలులో అధికారులు ఏమాత్రం దృష్టి కేంద్రీకరించడం లేదు. ఈ ప్లాస్టిక్ కవర్లు, ఇతర వస్తువులు వినియోగం వల్ల కాలుష్యం పెరిగి ప్రజలకు, పశువులకు తీవ్ర ఆరోగ్య సమస్యలు వస్తాయని తెలిసినా అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. గుంటూరు కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఉన్న దుకాణాల్లో ప్రతి చోట సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్నా అధికారులు కనెత్తి చూడటం లేదు. ప్రధానంగా సింగిల్ యూజ్ కవర్లు, ప్లాస్టిక్ వస్తువుల తయారీని పూర్తిగా నిరోధించకుండా వినియోగంపై విధించే ఆంక్షలు ఇప్పటి వరకు సఫలీకృతం కాలేదు. గత కొన్నేళ్లుగా ఏటా ఇదే తరహాలో నిషేధం అమలు చేస్తున్నట్టు ప్రకటించడం, కొద్ది రోజులు అధికారులు హడావుడి చేయడం తరువాత వదిలివేయడం పరిపాటిగా మారింది. ఈ ఏడాది ఈనెల ఒకటి నుంచి పెద్ద ఎత్తున ప్రచారం చేసిన నగర పాలక సంస్థ అధికారులు కనీసం అమలుపై దృష్టి పెట్టడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. నిషేధం అమలు ఆచరణలో విజయవంతం కాకపోయిన అధికారులకు మాత్రం కాసుల వర్షం కురుస్తోంది. ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల తయారీ దారులను ఏమాత్రం నిరోధించకపోవడం వల్ల మార్కెట్‌లోకి ఇప్పటికే పెద్ద ఎత్తున సరుకు ఉంది. నగరపాలక సంస్థ కార్యాలయం పరిసరాల్లో అన్ని దుకాణాల్లో కవర్ల వినియోగం, విక్రయం .జోరుగా సాగుతోంది. కానీ అధికారులు సంబంధిత చిరు వ్యాపారుల వద్ద సొమ్ములు తీసుకుని వదిలివేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రజలు బయటకు వచ్చే ముందు వస్త్రంతో తయారు చేసిన సంచులను తీసుకుని రావాలన్న స్పృహ చాలా మందికి ఉండకపోవడం వల్ల కూడా ప్లాస్టిక్ కవర్లు వినియోగం జరుగుతోంది. ప్లాస్టిక్ కవర్లలో పండ్లు, కూరగాయాలే కాకుండా అధిక వేడిగా ఉండే టీ, కాఫీలు, ఇతర ఆహార పదార్థాలు తీసుకువెళ్తున్నారు. దీంతో ప్లాస్టిక్ నేరుగా మనుషుల శరీరంలోకి వెళ్లి అనేక అనారోగ్య .

2లో



26 గేట్ల ద్వారా కృష్ణమ్మ పరవళ్లు

ప్రజాశక్తి - విపి సౌత్

కృష్ణానది పరివాహక ప్రాంతాలలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువనున్న జలాశయాలు నిండి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎగువ ప్రాజెక్టులన్నీ నిండి వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి శ్రీశైలం జలాశయం నుండి 3,75,576 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్ రిజర్వాయర్ వచ్చి చేరుతుండటంతో ఎన్ఎస్‌పి అధికారులు 26 క్రస్ట్ గేట్లను ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అందులో 8గేట్లను 10అడుగులు, 18గేట్లను 5 అడుగుల మేర ఎత్తి 363116క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువనుండి వరద ప్రవాహం పెరగటంతో నాగార్జున సాగర్ ప్రాజెక్టు 26 గేట్లనుండి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. దీనితో నాగార్జునసాగర్ డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు కాగా ప్రస్తుతం 584.80 అడుగుల వద్ద నీరు నిల్వవుంది. డ్యామ్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 312.0450 టీఎంసీలు కాగా ప్రస్తుతానికి 299.7430 టీఎం సీల నీరు నిల్వ ఉంది. జలవిద్యుత్ కేంద్రం ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేపడుతూ 28,826 క్యూసెక్కుల నీటిని, కుడి కాలువ ద్వారా 6006 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వద్వారా 4949 క్యూసెక్కుల నీటిని, ఎస్.ఎల్.బి.సి ద్వారా 2400 క్యూసెక్కుల నీటిని, లోలేవల్ కెనాల్ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని, రిజర్వాయర్ నుండి మొత్తం 2,93,663 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

రెండేళ్లలో శంకర్ విలాస్ బ్రిడ్జి పూర్తి : పెమ్మసాని

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు శంకర్‌విలాస్ బ్రిడ్జి పనులు రెండేళ్ల లో పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్టు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరు శంకర్ విలాస్ బ్రిడ్జి పనులను ఆదివారం ఆయన మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి పరిశీలించారు. నగర నడిబొడ్డున నిర్మాణం చేయడం వల్ల వాహనాల రాకపోకలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించామని అందువల్ల యుద్ధ ప్రాతిపదికన పనులు చేసి రెండేళ్లలో పూర్తయ్యేలా చూస్తామన్నారు. ఈ మేరకు నగర పాలక సంస్థ, ఆర్అండ్‌బి అధికారులు సమన్వయంతో పనులు వేగంగా చేస్తున్నారని అన్నారు. బ్రిడ్జి నిర్మాణంలో రైల్వే శాఖ స్థలం కూడా ఉందని అందువల్ల వారికి ప్రత్యామ్నాయ స్థలం చూపిన తరువాత రైల్వే స్థలం నిర్మాణానికి తీసుకోవాల్సి ఉందని ఈమేరకు అనుమతి కోసం రైల్వే బోర్డును సంప్రదిస్తామన్నారు.

భవన నిర్మాణ కార్మికుల లేబర్ కమిషనరేట్ వద్ద

15న సామూహిక రాయబారం

ప్రజాశక్తి-గుంటూరు



మాట్లాడుతున్న దండా లక్ష్మీనారాయణ

భవన నిర్మాణ సంక్షేమబోర్డు పునరుద్ధరించాలని కోరుతూ సెప్టెంబర్ 15న విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే సామూహిక రాయబార కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. ఆదివారం పాతగుంటూరు సిఐటియు జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు నార్నే నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 15 నెలలు కావస్తున్నా ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలు ఒక్కటీ అమలు కాలేదన్నారు. తక్షణమే సంక్షేమ బోర్డు పునరుద్ధరించి సంక్షేమ పథకాల అమలు చేయాలని, లేనియెడల ప్రత్యక్ష ఆందోళనలకు దిగుతామని హెచ్చరించారు. సంవత్సరం గడిచిందని.. సుపరిపాలన పేరుతో యాత్రలు చేస్తున్న

2లో

చిత్తశుద్ధితో హామీల అమలు

మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

టిడిపి జిల్లా కమిటీలపై అభిప్రాయసేకరణ

2లో

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించం : డిఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు పశ్చిమ డివిజన్ పరిధిలో గంజాయి విక్రయం, వినియోగంపై అరెస్టు అయిన 51 మందికి ఆదివారం అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. గుంటూరు పశ్చిమ డిఎస్‌పి అరవింద్ మాట్లాడుతూ గంజాయ్ కేసుల్లో నిందితులను పిలిచి కౌన్సెలింగ్ఇచ్చామన్నారు. గంజాయి అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్కూల్లో,కాలేజీల్లో గంజాయి మీద మీద అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ముగ్గురు పై పీడీ యాక్ట్ ప్రతిపాదన అమలులో ఉందన్నారు. యువత గంజాయి జోలికి వెళ్లి వారి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు.

త్రిసభ్య కమిటీలకు త్వరలో శిక్షణ..



● సెప్టెంబరు కల్లా ఆడిట్ పూర్తి ● సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తి ● జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

జిల్లాలోని అన్ని సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలతో కూడిన పాలక వర్గాల నియామకం పూర్తయిందని జిల్లా సహకార శాఖ అధికారి వీరాచారి తెలిపారు. త్రిసభ్య కమిటీలో ఉన్న చైర్మన్, ఇద్దరు సభ్యులకు త్వరలో జిల్లా స్థాయిలో శిక్షణ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. వీరికి సహకార సంఘాల పనితీరు, రైతులకు చేయాల్సిన సేవలు, నియమ నిబంధనలు, సహకార చట్టాలు తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని ఆయన వెల్లడించారు. ప్రజాశక్తి ప్రతినిధికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు అంశాలు తెలియజేశారు.

పాలక వర్గాల నియామకం పూర్తయిందా?

జిల్లాలోని 64 సహకార సంఘాల్లో చైర్మన్, ఇద్దరు సభ్యులు చొప్పున నియామకం పూర్తి చేశాం. ఒకటి రెండు సంఘాలు తప్ప అన్ని చోట్ల వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ కమిటీల ఆధ్వర్యంలో సహకార సంఘాల కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయి. వీరికి త్వరలో శిక్షణ నిర్వహిస్తాం.

ఎరువుల సరఫరా ఎలా ఉంది?

జిల్లాలో సహకార సంఘాల్లో ఎరువుల సరఫరా పూర్తి స్థాయిలో జరుగుతుందని ఎక్కడా కొరత లేదు. సరఫరా బాగా ఉంది. మార్క్‌ఫెడ్, డిసిఎంఎస్ ద్వారా రైతుల అవసరం మేరకు ఎప్పటికప్పుడు సరఫరా చేస్తున్నారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారు. కృతిమ కొరత సృష్టించి కొంత మంది రైతుల్లో అయోమయం సృష్టించ డానికి ప్రయత్నిస్తున్నారు. రైతులకు సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ఎరువులు అందుతున్నాయి. ప్రైవేటు డీలర్ల వద్ద సమస్యలు ఉండవచ్చు. కానీ ప్రభుత్వ పరంగా ఎక్కడా సరఫరాలో లోపాలు లేవు.

సహకార సంఘాల్లో కొత్త సభ్యుల చేరిక?

ప్రస్తుతానికి ఎటువంటి మార్గదర్శకాలు లేవు. రూ.300 షేర్ ధనం రుసుము చెల్లించిన ఎవరైనా రైతులు,కౌలు రైతులు సభ్యులుగా చేరవచ్చు. ఎన్నికల నిర్వహణ లేకపోవడం వల్ల కొత్త సభ్యులను చేర్చుకునేందుకు ఎటువంటి మార్గదర్శకాలు రాలేదు. రైతులు పట్టాదారు పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ కార్డుతో ఈకేవైసితో సభ్యులుగా చేరవచ్కు. కౌలు రైతులు సిసిఆర్‌సి ఇస్తే సరిపోతుంది. ఈకేవైసి తప్పని సరిగా చేయించుకోవాలి.

సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ?

జిల్లాలోని 64 సహకార సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తయింది. అన్ని సంఘాల్లో రికార్డులు కంప్యూటరీకరణ ద్వారా నిర్వహిస్తున్నాం. కంప్యూటరీకరణతో రాష్ట్రంలో జిల్లాకు ఏడో స్థానం దక్కింది. ప్రస్తుతం ఆడిట్ జరుగుతుంది. ఆడిట్ ప్రక్రియ మొత్తం సెప్టెంబరు నాటికి పూర్తవుతుంది. ఆడిట్‌లో లోపాలు ఉంటే సంబంధిత సంఘాలపై చర్యలు తీసుకుంటాం.

15న సామూహిక రాయబారం

(మొదటి పేజీ తరువాయి)

అధికార పార్టీ నాయకులు కార్మికులకు ఏం చేశారో చెప్పాలన్నారు. సంక్షేమ బోర్డులో ఉన్న నిధులను భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి వినియోగించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు పరిష్కరించాలని కోరారు. రాజధాని నిర్మాణంలో స్థానికులకు ఉపాధి కల్పించాలని, వలస కార్మికులకు వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాలన్నారు. రాష్ట్రాల నుండి వచ్చే కార్మికుల సమాచారాన్ని లేబర్ డిపార్ట్మెంట్లో నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ డి.కోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఖాసింవలి, బాబురావు, సిఐటియు నాయకులు కె. శ్రీనివాసరావు, హుస్సేన్‌వలి, నక్కా మస్తాన్, విజయ్ పాల్గొన్నారు.

ఫార్సుగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

సమస్యలకు దారితీస్తోంది. అంతేగాకుండా ప్లాస్టిక్ కవర్ల వల్ల పర్యావరణం దెబ్బతింటోంది. ఈ కవర్లు భూమిలో కలవకపోవడం వల్ల పశువులు ఇతర వ్యర్థపదార్థాలతో కలిపి తినడం వల్ల తీవ్ర అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నాయి. వేడి ఆహార పదార్థాలు, టి, కాఫీలు ప్లాస్టిక్ కవర్లలో తీసుకుపోతున్నారు. టి కప్పుల్లో ఉండే ప్లాస్టిక్ లేయర్ వేడికి కరిగి ప్రజలు తీసుకునే కాఫీ, టి కప్పులలో కరిగి ప్రజల శరీరంలోకి నేరుగా ప్లాస్టిక్ చేరుతోంది. అయినా ఎవ్వరూ వినియోగాన్ని అరికట్టలేకపోతున్నారు. ప్రజారోగ్యానికి, డ్రైన్లలో మురుగుపారుదలకు, పర్యావరణంకు హానీ కల్గిస్తున్న ప్లాస్టిక్ ని సమూలంగా నిషేదించాలని ప్రజలు కోరుతున్నారు. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్‌పై ఏ స్థాయిలోనూ నిషేదం అమలు కావడం లేదు



డాక్టర్ ప్రజ్ఞాచారికి పురస్కారాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

డాక్టర్ ప్రజ్ఞాచారికి మదర్ థెరిస్సా పురస్కారం

ప్రజాశక్తి - తెనాలి

రూరల్ గ్రామం కొలకలూరుకు చెందిన సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి మదర్ థెరిస్సా జాతీయ పురస్కారాన్ని అందుకున్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన మదర్ థెరిస్సా ఎడ్యుకేషనల్ సొసైటీ 17వ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రంగాలలో కఋషి చేసిన వారికి పురస్కారాలను అందజేసింది. దానిలో భాగంగా ఆదివారం రావులపాలెంలోని సిఆర్సిఏ ఫంక్షన్ హాల్‌లో ప్రజ్ఞాచారిని సాహితి విభాగంలో మదర్ థెరిస్సా పురస్కారంతో సత్కరించారు. కార్యక్రమంలో సిఆర్‌సి ఫౌండర్ విక్టరీ వెంకటరెడ్డి, సంస్థ చైర్మన్ డాక్టర్ దిడ్ల కిషోర్, జాతీయస్థాయి చిత్రలేఖకులు ఒడియార్, సిద్ధాంతి తాతాజీ, రూరల్ సీఐ రమణమ్మ పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో సాహితీ పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా పలువురు సాహితి ప్రియులు ప్రజ్ఞాచారిని అభినందించారు.

ట్రాన్స్ యూనియన్ సిబిల్ 25వ వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

క్రెడిట్ వ్యవస్థపై విశ్వసనీయతను పెంపొందించేందుకు కృషి చేస్తున్న అగ్రగామి ఇన్‌సైట్స్, ఇన్ఫర్మేషన్ కంపెనీ ట్రాన్స్ యూనియన్ సిబిల్, 25వ వార్షికోత్సవాన్ని జరుపుకుంటోందని సంస్థ సిఇఒ భవేష్ జైన్ తెలిపారు. నగరంలోని సంస్థ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిబిల్ సిల్వర్ జూబ్లీ వేడుకల సందర్భంగా సుసంపన్న సాంస్కృతిక వారసత్వం, గణనీయమైన ప్రాచుర్యంతో తరతరాలుగా భారతీయులను అలరిస్తున్న అమర్ చిత్ర కథతో కలిసి 'సిబిల్ కీ కహానియా' పేరిట లెజెండరీ టింకిల్ కామిక్ బుక్ స్పెషల్ ఎడిషన్ రూపొందిందని తెలిపారు. క్రెడిట్ స్కోరు అనేది కేవలం అంకెలకే పరిమితం కాకుండా ఇంటి కొనుగోలు లేదా వ్యాపారాన్ని ప్రారంభించడం లేదా విద్యా రుణం ఇలా వ్యక్తిగత ఆకాంక్షల సాధనకు ఏ విధంగా తోడ్పడుతుందనేది తెలియజేసేలా ఇది ఉంటుందన్నారు. రుణం అనేది ఏ విధంగా పురోగతికి, పరివర్తనకు తోడ్పడుతోందనేది తెలియజేసే విధంగా ఈ ప్రచార కార్యక్రమాలు రూపొందించబడ్డాయి అన్నారు.

చిత్తశుద్ధితో హామీల అమలు : మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి

టిడిపి జిల్లా కమిటీలపై అభిప్రాయసేకరణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి మహ్మద్ ఫరూక్ తెలిపారు. గుంటూరులోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు జిల్లా అధ్యక్షులు తెనాలి శ్రావణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఏడాది కాలంలోనే సూపర్ సిక్స్ హామీలతో పాటు మేని ఫెస్టోలోని హామీలను కూడా అమలు చేశామన్నారు. రాబోయే కాలంలో పెండింగ్‌లో ఉన్న అన్ని హామీలను నెరవేరుస్తామన్నారు. ప్రజలకు మేలు చేసేందుకు పార్టీ నాయకత్వం పనిచేయాలన్నారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అన్ని తరగతులకు మేలు జరుగుతుందన్నారు. స్త్రీ శక్తి పథకం ద్వారా జిల్లాలో మహిళలకు పూర్తి స్థాయిలో ఉచిత రవాణా సదుపాయం వచ్చిందన్నారు. ఈ సమావేశం తరువాత జిల్లా పార్టీ నూతన కమిటీ ఏర్పాటుకు మంత్రి ఫరూక్, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజు, విజయనగరం జిల్లా డిసిసిబి చైర్మన్ కిమిడి నాగార్జునతో కూడిన త్రిసభ్య కమిటీ అభిప్రాయ సేకరణ చేసింది. జిల్లా అధ్యక్షులుగా ప్రస్తుతం ఉన్న తెనాలి శ్రావణ్‌కుమార్ స్థానంలో కొత్త వారికి అవకాశం ఇవ్వనున్నట్టు పార్టీ నేతలు చెబుతున్నారు.



మాట్లాడుతున్న మంత్రి ఎన్ఎండి ఫరూక్

ఈనేపథ్యంలో జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్‌చైర్మన్లు, ఇతర నాయకుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. బిసిలకు ఇస్తారన్న ప్రచారం నేపథ్యంలో తాడిశెట్టి మురళీ, నిమ్మల శేషయ్య, తాళ్ళ వెంకటేష్ యాదవ్, దాసరి రాజా మాస్టారుతోపాటు పలువురు నేతలు వచ్చి కమిటీ వారిని కలిశారు. అలాగే ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మేయర్ కోవెలమూడి రవీంద్ర తదితరుల కూడా జిల్లా అధ్యక్ష పదవిపై దృష్టి సారించినట్టు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు మహిళల కోటాలో అన్నాబత్తుని జయలక్ష్మి, యువత కోటాలో రావిపాటి సాయికృష్ణ కూడా జిల్లా అధ్యక్షుడులేక నగర అధ్యక్ష పదవిని ఆశిస్తున్నారు. అభిప్రాయ సేకరణలో జిల్లా అధ్యక్షుడుగా ఎవరు ఉంటే బాగుటుందని నాయకులను కోరారు. తొలుత ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయ సేకరణ పూర్తి చేసిన తరువాత కార్పొరేషన్ చైర్మన్లు,ఇతర నాయకులను పిలిచి ఏకాంతంగా మాట్లాడారు. కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కూడా కమిటీ తో భేటి అయ్యారు. జిల్లా అధ్యక్ష పదవిపై ఆయన కూడా కొన్ని పేర్లు సూచించారు. ఓసి కేటగిరిలో అయితే ఆలపాటి, దూళిపాళ్ల, కోవెలమూడి లో ఒకరికి జిల్లా అధ్యక్ష పదవి దక్కుతుందని తెలుస్తోంది. దళితులకు అవకాశం ఇస్తే తనకు ఇవ్వాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ కోరినట్టు తెలిసింది.

చెవి ముక్కు గొంతు సమస్యలపై జాగ్రత్త వహించాలి

ప్రజాశక్తి-గుంటూరు

అవగాహన సంస్థ ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం చెవి, ముక్కు, గొంతు సమస్యలపై జరిగిన ఆరోగ్య సభలో ఈఎన్‌టి సర్జన్ వి.వి.కె. సందీప్ పాల్గొని ప్రసంగించారు.చెవిలో గుబిలిని పిన్నీసులు, బడ్స్ లాంటి పరికరాలతో తీయొద్దని, డాక్టర్‌ను సంప్రదించి ఇబ్బంది లేని విధానంలో చెవిని శుభ్రపరచుకోవాలన్నారు. మధ్య చెవిలో ఇన్ఫెక్షన్ చేరే అవకాశం ఎక్కువగా ఉంటుందని, దాని వల్ల చెవి దబ్బడ, చెవి నుండి చీము కారటం లాంటి సమస్యలు ఉత్పన్నం అవుతాయన్నారు. వీటికి ప్రస్తుతం మంచి మందులు అందుబాటులో ఉన్నాయన్నారు.లోపలి చెవికి సమస్య వస్తే శస్త్ర చికిత్స అవసరం అవుతుందన్నారు. ప్రస్తుతం ఈ చికిత్సకు ప్రభుత్వం ద్వారా చాలా ప్రోత్సాహం లభిస్తుందన్నారు. ఐదేళ్లలోపు పిల్లలకు ఉచితంగా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందుతుందన్నారు. డాక్టర్ల సలహా మేరకు వినికిడి మిషన్‌ను పెట్టుకోవాలన్నారు. ముక్కు సమస్యల గురించి వివరిస్తూ చిన్న పిల్లలలో ఆడినాయిడ్స్ వల్ల ముక్కుకు సంబంధించిన సమస్యలు తలెత్తుతాయని, దీనివల్ల శ్వాస సరిగా ఆడకపోవడం జరుగుతుందన్నారు. పెద్దలలో ముక్కుదూలం వంకరగా ఉండటం, సైనసైటిస్ లాంటి సమస్యలు వస్తున్నాయని, ముక్కు దూలం వంకరగా ఉంటే శ్వాస సరిగా వెళ్లక ఇబ్బందికి గురవుతారని, దీనికి మంచి శస్త్రచికిత్స అందుబాటులో ఉందన్నారు. సైనసైటిస్ ఏ భాగంలో వచ్చిందో గుర్తించి మందులు వాడితే నయం అవుతుందన్నారు. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అనిపించగానే వెంటనే నాజిల్ డ్రాప్స్‌ను వాడటం మంచిది కాదన్నారు. తుమ్ములు సమస్య ఉన్నవారు సొంతంగా సిట్రిజిన్ లాంటి మందులను విరివిగా వాడటం మంచిది కాదని, ఎందుకు వస్తున్నాయో తెలుసుకొని దానికి సంబంధించిన వైద్యం తీసుకోవాలని, లేని ఎడల సమస్య పెద్దదయ్యే అవకాశం ఉందన్నారు. ఎలర్జీ గురించి మాట్లాడుతూ ఆహారం, వాతావరణం వల్ల ఈ సమస్య వస్తుందన్నారు. సాధారణంగా పెంపుడు జంతువులు కలిగి ఉన్నవారికి, మెడికల్‌కు సంబంధించిన వత్తిలో ఉండే వారికి, వాతావరణ కాలుష్యంలో పనిచేసేవారికి, కొన్ని రకాల ఆహారం పడక ఎలర్జీ సమస్య వస్తుందన్నారు. గొంతుకు సంబంధించి టాన్సిల్స్ సమస్య వస్తుందని, కొన్ని సందర్భాల్లో వీటిని తొలగించటం వల్ల పెద్దలలో నష్టమేమీ ఉండదని తెలిపారు. బ్లాక్ ఫంగస్, గురక సమస్య సమస్యల గురించి వివరించారు. అనంతరం డాక్టర్ సందీప్‌ను అవగాహన సభ్యులు ఘనంగా సత్కరించారు. సభలో టీ.వీ .సాయిరాం, చల్లా అంజిరెడ్డి, కళ్యాణం చంద్రశేఖరరావులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సందీప్

కొనసాగుతున్న మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీలు

ప్రజాశక్తి - వినుకొండ

నరసరావుపేట రోడ్డులోని నిర్మల స్కూల్లో గుంటూరు బాల్ బ్యాడ్మింటన్ మహిళల జట్టు, సబ్ జూనియర్, సీనియర్ జట్లకు జరుగుతున్న శిక్షణ శిబిరాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్ బ్యాట్మెంటల్ అసోసియేషన్ సెక్రెటరీ వై.శ్రీనివాసరావు సందర్శించారు. శిక్షణ క్యాంపు ఈనెల 28 వరకు జరుగు తుందన్నారు. 29 నుండి 31 వరకు ప్రకాశం జిల్లా చేవూరులో జరిగే 11వ రాష్ట్ర స్థాయి పోటీల లో క్రీడాకారిణిలు పాల్గొంటారని అన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ శిక్షణలో మంచి మెళ కువలు నేర్చుకోవా లని, ఇప్పుడు తీసుకున్న శిక్షణ రాష్ట్ర స్థాయి పోటీలలో మెరుగ్గా ఆడేందుకు దోహదం చేస్తుందని అన్నారు. క్రీడాకారులకు వినుకొండ బీవీ రెడ్డి ఎలక్ట్రానిక్ బి.వి. సురేష్, సెవెన్ హిల్స్ బీఈడీ కాలేజీ కరస్పాం డెంట్ దళారీ అనిల్ కుమార్ శిక్షణలో ఉన్న క్రీడాకారిణిలకు భోజనం, నిత్యవసరాలకు సహాయం చేసినందుకు ధన్య వాదాలు తెలిపారు. కార్యక్రమంలో బాల్ బ్యాడ్మిం టన్ జాయింట్ సెక్రెటరీ జోనా నాయక్ సుపీరియర్ సిస్టర్ సిసిలి, ప్రిన్సి పాల్ సిస్టర్ రాణి, ఏడి ఆంజనేయులు, పీఈటి శ్రీనివాసరావు, సంధ్య, ఉపాధ్యాయులు జిలాని పాల్గొన్నారు.



క్రీడాకారులతో సెక్రటరి శ్రీనివాసరావు


వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

హెల్మెట్ తప్పనిసరి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

ఫిరంగిపురం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఆదివారం హెల్మెట్ అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. గుంటూరు-కర్నూలు హైవే రహదారి పక్కన జరిగిన ఈ కార్యక్రమం సీఐ కె. శివ రామకృష్ణ సూచనల మేరకు, ఎస్సై పి. శ్రీనివాస రావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ "ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించకపోవడం వల్ల వందలాది కుటుంబాలు కన్నీరు మున్నీరవుతున్నాయి. పోలీ సులు ఆపుతారనే భయంతో కాదు, ప్రాణ రక్షణ కోసం హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి. హెల్మెట్ ధరించినంత మాత్రాన ప్రాణాలు పోవని హామీ ఇవ్వలేము కానీ అది ఒక జీవన రక్షణ కవచం. కాబట్టి ప్రతి వాహనదారుడు బాధ్యతగా హెల్మెట్ వాడాలి" అని పిలుపునిచ్చారు. "హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేస్తే వ్యక్తిగతంగానూ, కుటుంబ పరం గానూ ఎన్నో ఇబ్బందులు తప్పవు. ఒక క్షణం నిర్ల క్ష్యం ప్రాణాంతకమవుతుంది" అని ఆయన హెచ్చ రించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ ఎస్సైఆర్. నవీన్, ఏఎస్సై జాన్ ఖాన్, పోలీస్ సిబ్బంది గురవయ్య, రామచంద్రయ్య పాల్గొన్నారు.

కొనసాగుతున్న వరద ఉధృతి

పులిచింతలకు 4,01,905 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి- రెంటచింతల

మండలంలోని సత్రశాల వద్ద కృష్ణా నదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టైల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టు నుంచి దిగువన ఉన్న పులి చింతలకు 4,01,905 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కే. వెంకటరమణ తెలిపారు. 13 రేడియల్ క్రస్ట్ గేట్లను 4.5 మీటర్లు, 5 గేట్లను4 మీటర్ల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలి పారు. ఎగువన ఉన్న నాగార్జునసాగర్ నుంచి 3,96,478 క్యూసెక్కుల నీరు రిజర్వా యరుకు వస్తుందన్నారు. రిజర్వాయర్లో ప్రస్తుతం 74.28 మీటర్లు మేర నీరు ఉండగా ఈ నీరు 6.820 టీఎంసీ లకు సమానం అన్నారు. విద్యుత్ ఉత్పత్తి ఆపివేశామన్నారు.

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ మృతి

ప్రజాశక్తి తెనాలి

ఆత్మహత్యాయత్నం చేసిన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు స్థానిక మారిస్‌పేట సీఎం కాలనీకి చెందిన షేక్ గౌసియా(55) కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతోంది. ఈ నేపధ్యంలో ఈ నెల 18న ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబ సభ్యులు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. వైద్యశాల నుండి వచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28న విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ

ప్రజాశక్తి - అమరావతి


సమావేశంలో మాట్లాడుతున్న వక్తలు

విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభను ఈనెల 28వ తేదీన నిర్వహిస్తున్నామనీ, ఈ సభను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఆదివారం అమరావతిలో నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు మాట్లాడారు. అదానీ కంపెనీ విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించే ఆలోచనను ఉపసంహరించు కోవాలనీ, వివిధ రూపాలలో వేసిన విద్యుత్ అదనపు భారాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అదాని కంపెనీతో కుదుర్చుకున్న ఒప్పందంలో భాగంగా స్మార్ట్ మీటర్లను ఇళ్లకు బిగించి రూ.17వేలుగా ఉన్న ఒక్కొక్క మీటరు ధరను మొత్తం 93 నెలల్లో విని యోగదారుల వద్దే వసూలు చేస్తా రని అన్నారు. విద్యుత్ లోడు పేరుతో అదనపు డిపాజిట్ వసూలు చేస్తారని అన్నారు. అదాని కంపెనీ సిబ్బంది మన ఇళ్లకు వచ్చి స్మార్ట్ మీటర్లు బిగించాలని చూస్తే అక్కడి ప్రజలం దరూ ఐక్యంగా అడ్డుకోవాలని పిలుపు నిచ్చారు. విద్యుత్ ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను తక్షణమే ఉపసంహరించుకోవాలని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రతి పక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లను పగలగొట్టాలని పిలుపుచ్చిన నారా లోకేష్ ఇప్పుడు ఎలా అమలు చేస్తున్నారని ప్రశ్నించారు. బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వాలు మారినా దోపిడీ మాత్రం ఆగట్లేదన్నారు. అదానీకి లాభాలు కట్టబెట్టేందుకు ప్రభుత్వాలు పని చేస్తున్నాయన్నారు. మీటర్ల వల్ల భవిష్యత్‌లో విద్యుత్ రేట్లు భారీగా పెరుగుతాయని, ఇప్పటికే వాణిజ్య సముదాయాలలో బిగించిన మీటర్ల వల్ల చార్జీలు పెరగటం చూస్తున్నామన్నారు. కొత్త మీటర్లకు అయ్యే ఖర్చును కూడా వినియోగదారుల వద్దే వసూలు చేస్తున్నా రన్నారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు బిగిస్తే అంగీకరించబోమని, అడ్డు కుంటామని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లు ఉపసంహరించు కొని, ట్రూఅప్, ఇంధన సర్దుబాటు ఛార్జీలు ఉపసంహరిం చుకునే వరకూ విద్యుత్ ఉద్యమం ఆగదన్నారు. కార్యక్రమంలో ప్రజా వేదిక కన్వీనర్ బి.సూరిబాబు, టీ లక్ష్మణ్ ప్రసాదు, అని రాజా, వెంకటేశ్వరరాజు పెద్దలు పాల్గొన్నారు.

సంస్కరణలపై బహిరంగ అధ్యయనం

ప్రజాశక్తి-చిలకలూరిపేట


మాట్లాడుతున్న తిరుపతి స్వామి

బహిరంగ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పండరీపురంలోని ఏలూరి సిద్దయ్య విజ్ఞాన కేంద్రంలో విద్యుత్తు రంగ సంస్కరణలు-ప్రజలపై భారాలు అనే అంశంపై యుటిఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి కే. తిరుపతి స్వామి మాట్లా డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్క రణలు అనేవి ప్రజలకు ఉపయోగపడేవిగా ఉండాలన్నారు. దేశ వ్యాప్తంగా 1991వ సంవత్సరం నుంచి ఏ సంస్కరణలు తీసుకు వచ్చిన అవి కార్పొరేట్ సంస్థలకు లాభాలు తెచ్చి పెట్టేవిగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సంస్కరణల పునాది 1991 నుంచి 1999 వరకు ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు విద్యు త్తు బోర్డును మూడు ముక్కలుగా చేశారన్నారు. దీనిపై విద్యుత్తు రెగ్యులేటర్ కమిషన్ను ఏర్పాటు చేస్తూ చట్టం తీసు కొచ్చా రన్నారు. సంస్కరణలో భాగంగా విద్యుత్ ఛార్జీలను పెంచిన సమయంలో ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమించా రన్నారు. అందు లో భాగంగా బషీరాబాద్‌లో జరిగిన పోలీసు కాల్పుల్లో ముగ్గురు మరణించారనీ, వందలాదిమంది క్షతగా త్రులు అయ్యారన్నారు. ఈ పోరాట ఫలితంగా విద్యుత్తు చార్జీల పెంపును ఆనాడు తాత్కాలికంగా ఆపివేశారన్నారు. తర్వాత ఏదో ఒక పేరుతో ప్రజలపై భారాలను మోపుతూ వచ్చారన్నారు. విద్యుత్తు రం గాన్ని ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకో వాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పేరు బోయిన వెంకటే శ్వర్లు, సాతులూరి లూతర్, సాతులూరి బాబు, సాతులూరి కృపారావు, జేమ్స్, భారతి, శివపార్వతి పాల్గొన్నారు.

రౌడీయిజం జగన్ పార్టీ సంస్కృతి : జీవీ


ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గం నూజెండ్ల మండలం టి. అన్నారం గ్రామంలో పొడిచింది, గాయపడింది... ఇద్దరూ బొల్లా బ్రహ్మనాయుడు ప్రోత్సహించి పోషించిన వారే అయినప్పుడు తెలుగుదేశానికి ఏమి సంబంధమని ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ప్రశ్నించారు. ఒక గ్రామంలో రెండు కుటుంబాల మధ్య పాత తగాదాలతో జరిగిన ఘర్షణకు ఆంజనేయులు, మక్కెన మల్లికార్జున రావుకు ఏమైనా సంబంధం ఉందా అని నిలదీశారు. నిజానికి వైకాపా, బొల్లా పెంచిన పోషించిన రౌడీయిజం, గూండాయిజం వల్లనే రషీద్ లాంటి వాళ్ల హత్యకు గురయ్యారని, ఇకనైనా తప్పుడు ప్రచారాలు ఆపాలని హితవు పలికారు. గాయపడ్డ ప్రసాద్ తాతా రామ యోగి బొల్లా వద్ద పనిచేశారా లేదా చెప్పాలన్నారు. జగన్ తన సొంతబాబాయిని చంద్రబాబు చంపించారని నానా యాగీ చేస్తే చివరకు సీబీఐ అవినాష్‌రెడ్డిని ఆ కేసులో ప్రధాన నిందితుడిగా అరెస్టు చేసినప్పుడు వారి విశ్వసనీయతను చూసి ప్రజలంతా ముక్కున వేలేసుకున్నారని ఎద్దేవా చేశారు. సొంత బాబాయినే చంపించిన జగన్ పట్ల వైకాపా పార్టీ కార్యకర్తలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోకారు.ఇప్పటి వరకు పులివెందులలో ఎన్నికలు ఎలా జరిగాయో మొన్న అక్కడ జరిగిన జెడ్పీటీసీ ఎన్నికలే నిదర్శనమన్నారు. ఇప్పటి వరకు రిగ్గింగ్‌ల సాయంతో గెలిచిన వారు ఇప్పుడు న్యాయబద్ధంగా ఎన్నికలు జరిగితే చిత్తుచిత్తుగా ఓడిపోయారని చురకలు వేశారు. జీడీసీసీబీ ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎక్కడో టి.అన్నారంలో జరిగిన సంఘటనతో ఇంత డిప్రెషన్‌లోకి పోతే ఎలా అని బొల్లా బ్రహ్మనాయుడును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ఎక్కడైనా అభివద్ధి, సంక్షేమ పథకాలను ఓర్వలేకనే ఇలా బురదజల్లాలని చూస్తున్నా విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాల మీద మాట్లాడటంలో తప్పు లేదని, కానీ వ్యక్తిగత దూషణలకు దిగడం బాధాకరమని అన్నారు. కార్యక్రమంలో కొమ్మ శీను, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మీసాల మురళీ కష్ణ యాదవ్, గోవిందరాజులు పాల్గొన్నారు.

అరాచక పాలనతో కూటమి ప్రభుత్వం

- ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



అభివృద్ధిని గాలికొదిలి అప్రజాస్వామిక, అరాచక పాలనతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని శాసనమండలి సభ్యులు లేళ్ళ అప్పిరెడ్డి ఆరోపించారు. దాడులు, దౌర్జన్యాలతో తెలుగుదేశం నేతలు రెచ్చిపోతున్నారని ఆయన ఆరోపించారు. విజ్ఞులైన ప్రజలు అంతా గమనిస్తున్నారనీ తగిన గుణపాఠం నేర్పించేందుకు సిద్ధంగా ఉన్నారనీ లేళ్ళ అప్పిరెడ్డి స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం టి.అన్నవరం గ్రామానికి చెందిన వైసిపి కార్యకర్త ప్రసాద్‌పై శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన టిడిపి నేతలు దాడి చేశారన్నారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడి గుంటూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో ప్రసాద్ చికిత్స పొందుతున్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పార్టీ నేతలతో కలిసి ఆదివారం ఉదయం ఆసుపత్రికి వెళ్లి ప్రసాద్ పరిస్థితిపై వైద్యులను ఆరా తీశారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రెడ్ బుక్ రాజ్యాంగం అమలవుతుందన్నారు. వైసిపి నగర అధ్యక్షులు నూరిఫాతిమా, తాడికొండ సమన్వయకర్త డైమండ్‌బాబు, పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీ తదితరులు పాల్గొన్నారు.


శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ గోపిరెడ్డి

శిలాఫలకం ధ్వంసంపై మాజీ ఎమ్మెల్యే ఆగ్రహం

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలో 20 వార్డులో వైసిపి హయాం లో చేపట్టి పూర్తి చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి శిలాఫలకంలో అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పేరును గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు. వార్డు వైసిపి నాయ కులు ద్వారా సమాచారం తెలుసుకున్న డాక్టర్ గోపిరెడ్డి వార్డు కు వెళ్లి ధ్వంసం అయిన శిలాఫలకాన్ని పరిశీలించారు. అభి వృద్ధి పనులకు చిహ్నంగా నిలిచే శిలాఫలకాలు ధ్వంసం చేయ డం సరికాదన్నారు. ఘటనకు పాల్పడిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ద్విచక్ర వాహనంపై నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-రెంటచింతల


మృతి చెందిన ముష్కా శంకర్

మండలంలోని గోలి గ్రామ కూడలిలో ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనం పైన స్కూటీ మీద నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెంది న సంఘటన జరిగినది ఎస్ఐ సిహెచ్. నాగార్జున తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల సమీపంలోని లక్ష్మీపేట మండలం ఊటు కూరు గ్రామానికి చెందిన ముష్కాశంకర్(55) గత 15 సంవత్సరాలుగా పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ మైన్స్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఉదయం కూర గాయలు, ఇతర సరుకులు కొనుగోలు నిమిత్తం రెంట చింతలకు వచ్చి తిరుగు ప్రయాణంలో అడ్డరోడ్డు వద్ద వాహనం పైనుంచి ప్రాణాలు విడిచాడు గుండె పోటుకు గురై మృతి చెందాడని భావిస్తున్నారు. ఆయనకు భార్య లత, ఇద్దరూ ఆడ పిల్లలు ఉన్నారు. లత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం గురజాల ప్రభు త్వాసుపత్రికి తరలించారు.

మృతురాలు గుర్తింపు

ప్రజాశక్తి- తాడేపల్లి

శనివారం సీతానగరం పుష్కర ఘాట్ వద్ద కృష్ణ నదిలో దూకి ఆత్మహత్య చేసుకున్న మహిళ విజయవాడ నగర సమీపంలోని, కానూరుకి చెందిన నలుకుర్తి విజయ భారతి (31) విజయవాడ సమీపంలోని కానూరుకి చెందిన మహిళగా తాడేపల్లి పోలీస్ స్టేషన్ అధికారులు ధ్రువీకరించారు. మతి స్థిమితం సరిగ్గా లేక ఈ దారుణానికి పాల్పడిందని తండ్రి ఇమాన్యుల్ తెలిపారు. పోలీస్‌స్టేషన్లో ఉన్న పాప అనైక్య ఏంజెల్‌ను కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఉపకార వేతన పరీక్షకు దరఖాస్తులు

ప్రజాశక్తి- రెంటచింతల

జాతీయ ఉపకార వేతన పరీక్ష నేషనల్ మీన్స్ కామ్ మెరిట్ స్కాలర్ షిప్ పరీక్షకు ఈనెల 31 లోపు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ - 1 ఇంచార్జి డిప్యూటీ ఈవో ఏసుబాబు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు ఆన్ లైన్‌లో పంపా లని ప్రభుత్వ, స్థానిక సంస్థల ఆధ్వర్యంలోనే పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు ఏడవ తరగతిలో కనీసం 55 శాతం మార్కులు సాధించాలని ఎస్సీ, ఎస్టీ విద్యా ర్థులకు ఐదు శాతం మార్కుల మినహాయింపు ఉంటుందన్నారు వార్షిక ఆదాయం రూ. 3.5 లక్షలకు మించ రాదన్నారు. కేంద్రీ య విద్యాలయం, నవోదయ, రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువు తున్న వారు అర్హులు కాదన్నారు. 9వ తరగతి నుంచి ఇంటర్ రెండవ సంవత్సరం వరకు ఉపకార వేతనం ఏడాదికి రూ.12 వేలు విద్యార్థుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారన్నారు.



జెవివి పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖ వైద్యులు, నాయకులు

మూఢనమ్మకాలు నిర్మూలించాలి

జెవివి జిల్లా మహాసభలో వక్తలు

ప్రజాశక్తి - వినుకొండ

పల్నాడు జిల్లా జనవిజ్ఞాన వేదిక మహాసభ ఆదివారం వినుకొండ సిపిఎం కార్యాల యంలో జెవివి పల్నాడు జిల్లా అధ్య క్షులు కె.వి.రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ ఎల్ ఎన్ రావు, డి వెంకట్రావు జెవివి పతాకాన్ని ఆవిష్కరించారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్ర రామారావు శాస్త్రీయ దక్పథం విద్యార్థులలో పెంపొందించాలని వివరించారు. మూఢనమ్మకాలు నిర్మూలించాలని, ప్రతి ఒక్కరూ విజ్ఞాన దృక్పథంతో ముందుకు నడవాలని, జ్యోతిష్యం, వాస్తు, గ్రహబలాలు, చేతిరాతలు, పునర్జన్మలు, బల్లిశాస్త్రాలు, పుట్టు మచ్చ శాస్త్రాలు అశాస్త్రీయమనీ, వాటిని నమ్మవద్దని అన్నారు. సైన్స్ అనే టెక్నాలజీని నిత్యజీవితంలో ఉపయోగించుకొని ముందుకు నడవాలని వక్తలు దార్ల బుజ్జిబాబు, కే. శ్రీనివాసరెడ్డి, కే.నారాయణ, జి.కమలారామ్, ఎస్.చలపతిరావు, జేవీకే. ప్రసాద్ తెలియజేశారు. మహాసభలో పల్నాడు జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కేవీ రమణ, ప్రధాన కార్యదర్శిగా చలపతిరావు, కోశాధికారిగా డి.వెంకట్రావు, సహ కార్యదర్శిగా జి.కమలారామ్, సలహాదారునిగా కే. ఆది నారాయణ, జిల్లా సమతా విభాగం కన్వీనర్‌గా కే. రేణుక, జిల్లా గౌరవాధ్యక్షులుగా ఏ.నాగేశ్వరరావు, కార్యవర్గసభ్యులుగా బి.త్రివిక్రమ్, జె.శ్రీని వాసరావు, బి.రవికుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్రకార్యదర్శి డాక్టర్‌దార్ల బుజ్జిబాబు తెలిపారు. పలనాడుజిల్లా జెవివి సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎవఓ గుంటుపల్లి బాలకృష్ణ

రాజ్యాంగ హక్కులపై మితవాదుల దాడి

గుంటుపల్లి బాలకృష్ణ

ప్రజాశక్తి-ముప్పాళ్ల

2014లో కేంద్రంలో బీజేపీ అధికారం చేపట్టిన తర్వాత ఆనాటి నుంచి ఈనాటి వరకు రాజ్యాంగం హక్కులపైన మితవాద శక్తుల దాడి కొనసాగుతోందని రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి బాలకృష్ణ అన్నారు. మండలంలోని మాదల గ్రామంలో రాజ్యాంగం, సోషలిజం, లౌకికవాదం, మితవాద శక్తులపై దాడి అనే అంశంపై బహిరంగ అధ్యయన వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం 2019వ సంవత్సరంలో స్వతంత్రంగా మెజార్టీ సాధించడంతో దూకుడు మరింత పెంచిందనీ 2024 ఎన్నికల్లో బిజెపి ప్రభుత్వానికి అనుకున్న సీట్లు రాని కారణంగా బలం తగ్గిన బిజెపి ఆర్ఎస్ఎస్ తన దూకుడు మాత్రం తగ్గించడం లేదని బిజెపి ఆర్ఎస్ఎస్ మొదటి నుంచి ఈ రాజ్యాంగానికి వ్యతిరేక మని దేశంలో మైనార్టీలు, దళితులు, గిరిజనులకు, మహిళలకు సమాన హక్కులు లేకుండా బిజెపి హిందూ రాజ్యం కావాలని కోరుకుంటుందనీ, ఆ రాజ్యం కోసం పాకులాడు తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం మరో జాతి ఉద్యమం నిర్మించాలని ఆయన పిలుపు నిచ్చారు. ప్రజా సంఘాల నాయకులు గారాజాలయ్య, పఠాన్ సైదాఖాన్, దారాచిన్నారావు, చింతపల్లి నాగమల్లేశ్వరరావు, కంచర్ల నాగేశ్వరావు, ఇందూరి సత్యనారాయణ రెడ్డి, తోట వెంకటేశ్వర్లు, మార్పుల వెంకటరెడ్డి తోట బ్రహ్మయ్య పాల్గొన్నారు.

పలనాడి పట్టుకునేదెప్పుడు

- నత్తనడకన వైద్యకళాశాల పనులు
- నాలుగేళ్లు దాటినా సగానికి లోపే పూర్తి
- వైద్యం కోసం తప్పన దూరాబారం పరుగులు
- వైద్యశాల కోసం ఆశగా ప్రజల నిరీక్షణ



అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాల

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

పిడుగురాళ్ల మండలం కామేపల్లిలో 48 ఎకరాల విస్తీర్ణంలో 13లక్షల చదరపు అడుగుల స్థలంలో రూ.500 కోట్లతో వైద్య కళాశాల నిర్మాణానికి 2021 జూన్ 25వ శంకుస్థాపన చేశారు. 100 సీట్లతో మెడికల్ కళాశాల, 550 పడకలతో వైద్యశాల, 60 నర్సింగ్ సీట్లతో నర్సింగ్ కళాశాల, ల్యాబ్‌లు, మార్చురి, డ్రగ్ రూమ్, హాస్టల్స్, క్వార్టర్స్‌తో కలిపి రెండు దశల్లో పనులను 18 నెలల్లో పూర్తి చేయాలని అప్పటి వైసిపి ప్రభుత్వం నిర్దేశించింది. నిర్మాణ ఖర్చులో 60 శాతం కేంద్ర ప్రభుత్వం, 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం వాటాగా నిర్ణయించారు. అయితే అనుమతుల మంజూరు, నిధుల విడుదలలో జాప్యం, ఇతర కారణాల వల్ల వైద్య కళాశాల నిర్మాణం కుంటుపడింది. అయినా ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని 2024లో అప్పటి ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి వైద్యశాలను పూర్తి చేసినట్లు ప్రకటించి ప్రారంభోత్సవం చేశారు. త్వరలోనే వైద్యసేవలు ప్రారంభిస్తామన్నారు. అయితే వాస్తవానికి అప్పటికి ఆస్పత్రి నిర్మాణం 70 శాతమే పూర్తయ్యింది. ఇతర పరికరాలేమీ రాలేదు. అనంతరం ఎన్నికల రావడంతో నిర్మాణ పనులు నిలిచాయి. ప్రస్తుతానికి మొత్తం పనుల్లో 45 శాతం పూర్త వ్వగా కీలకమైన పనులు మిగిలే ఉన్నాయి. 550 పడక లతో కూడిన వైద్యశాల మాత్రం 70 శాతం పూర్తయిందని, డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

2025-26 విద్యా సంవత్సరానికి మెడికల్ కళాశాలలో సీట్లు ఏర్పాటు చేస్తామని వైద్యారోగ్య శాఖ మంత్రి చెబుతున్నా నిర్మాణ పనులు మాత్రం ఆ దిశగా కనిపించడం లేదు. గతంలో సుమారుగా 1200 మంది కార్మికులతో రేయింబవళ్లు పనులు చేశారు. నిధుల విడుదలలో జాప్యం వల్ల 6 నెలల నుండి 300 మందిలోపే పనిచేస్తున్నారు.

వెనుకబడిన పల్నాడు జిల్లాలో అందిన ద్రాక్షలా ఉన్న వైద్య విద్య, వైద్య సేవలను అందించేందుకు నిర్మించ తల పెట్టిన మెడికల్ కళాశాలకు నాలుగేళ్ల క్రితం శంకుస్తాపన చేయగా ఇప్పటికీ అసంపూర్తిగా వెక్కిరిస్తోంది. పనుల కాంట్రాక్టును దక్కించుకున్న సంస్థ నిర్మాణం పూర్తిపై ఎప్పటికప్పుడు కొత్త తేదీలను చెప్పడం మినహా పనుల్లో పెద్దగా పురోగతి ఉండడం లేదు.

ప్రభుత్వం మారిన తర్వాత ఆరు నెలలు పనులే జరగలేదని తెలిసింది. కొన్ని బ్లాకుల నిర్మాణం ఇప్పటికీ పిల్లర్ల దశలోనే ఉంది. ముందుగా వైద్యశాల పూర్తి చేసి అందులో 6 నెలల పాటు వైద్యసేవలు అందిస్తేనే ఎపిఎంఐసి నుండి మెడికల్ కళాశాల నిర్మాణానికి అనుమతులు లభిస్తాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే పల్నాడు జిల్లాలోని అనేక ప్రాంతాలకు వైద్య సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఏదైనా ప్రమాదం జరిగినా, ఇతర అత్యవసర వైద్యం అవసరమైనా పల్నాడులో అందే పరిస్థితి లేదు. గుం టూరు, విజయవాడ వంటి నగరాలకు వెళ్లాల్సి వస్తుంది. మాచర్ల, వెల్దుర్తి, వినుకొండ వంటి చివరి ప్రాంతాల వారైతే ప్రాణంమీదకు వస్తున్న సందర్భాలూ ఉన్నాయి. ఈ పరిస్థితి నుండి పల్నాడు ప్రజలు బయటపడాలంటే కామేపల్లిలో చేపట్టిన వైద్య కళాశాల నిర్మాణం పూర్తయ్యి ప్రజలకు అందుబాటులోకి రావాలి. కనీసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూడా లేని ఈ ప్రాంతంలో 100 సీట్లతో మెడికల్ కళాశాల ఏర్పాటైతే ఈ ప్రాంతంలో మరికొన్ని విద్యా సంస్థలు ఏర్పాటై ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని, ఉపాధి అవకాశాలూ వస్తాయని ప్రజలు భావిస్తున్నారు. ఇందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పిల్లర్ల దశలో ఉన్న మెడికల్ కళాశాల

భూములు కోల్పోయిన రైతులకు పరిహారం ఇవ్వండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

పేరేచర్ల-కొండమోడు రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న రైతులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని ఏపి రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత రైతులతో నరసరావుపేట కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. గోపాల రావు మాట్లాడుతూ ఈ రహదారి నిర్మాణం వలన వందలాది పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన రైతులు ప్రజలు వ్యవసాయ భూములు, ఇళ్ళు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్నారన్నారు. ప్రజోపయోగ సర్వీసుల పేరుతో రైతుల, పేదల ప్రయోజనాలను ప్రభుత్వం, అధికారులు గాలికి వదిలేయడం సరైన నిర్ణయం కాదన్నారు. కొందరు రైతులు వ్యవసాయ భూములు కోల్పోతుండగా కొందరు ఇళ్ళు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్నారన్నారు. భూములు, ఇళ్ల స్థలాలు కోల్పోతున్న రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం న్యాయమైన పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. ఆ భూములకు మార్కెట్ ధరలకు రెండున్నర రెట్లు అదనంగా ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నూతనంగా నిర్మించే ప్రాజెక్టుల కింద నష్టపోయే బాధితులకు సంతృప్తికరంగా పరిహారమిచ్చి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెండ్యాల మహేష్, బాధిత రైతులు చుక్కపల్లి శ్రీనివాస రావు, యెల్లినేడి వెంకటేశ్వరరావు, దుగ్గినేని నరసింహారావు, మల్లంపూడి వెంకట్, జంపని అరవింద్, వెంకటస్వామి, సంగెపు శ్రీనివాసరావు, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గోపాలరావు, రైతులు

యుటిఎఫ్ ఆధ్వర్యంలో నేడు మహా ధర్నా

ధర్నా జయప్రదానికి యుటిఎఫ్ పల్నాడు జిల్లా కమిటీ పిలుపు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానం అమలు సాధనకు యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం విజయవాడ ధర్నా చౌక్ వద్ద జరిగే మహా ధర్నాలో యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని యుటిఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాస రెడ్డి, ఎం మోహనరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పెన్షన్ విధానాన్ని 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి నియామకం పొందిన ఉద్యోగ ఉపాధ్యాయులకు వర్తింప˜జేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందనీ, అయితే 2003లో డిఎస్‌సి నోటిఫికేషన్ ఇచ్చి ఫలితాలను వెల్లడించినప్పటికి ప్రభుత్వం నియామక ఉత్తర్వులు ఇవ్వడంలో ఆలస్యం చేసిందన్నారు. ప్రభుత్వ అలసత్వం వల్ల నూతన పెన్షన్ విధానంలోకి నెట్టి వేయబడ్డారన్నారు. కేంద్ర ప్రభుత్వం మెమో నెంబర్ 57 ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు పరిచిందనీ, రాష్ట్ర ప్రభుత్వం మీన మేషాలు లెక్కిస్తూ 11 వేల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయుల పాత పెన్షన్ అమలులో తీవ్ర జాప్యం చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి పాత పెన్షన్ విధానం అమలుకు ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనిపై ప్రభుత్వం దిగిరాకపోతే యుటిఎఫ్‌తో కలిసి వచ్చే ఉపాధ్యాయ సంఘాలను కలుపు కుని దశల వారీ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.



డాక్టర్ శ్రీనివాస్‌తో రోగి, అతని కుటుంబ సభ్యులు

90 ఏళ్ళ వృద్ధునికి అరుదైన చికిత్స

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని శకుంతల జనరల్ , గ్యాస్ట్రో లివర్ కేర్ (డాక్టర్ దత్తు గారి హాస్పిటల్) హాస్పిటల్‌లో 90 వృద్ధునికి అరుదైన చికిత్స నిర్వహించామని డాక్టర్ ఐలా శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నరసరావుపేట పట్టణానికి చెందిన 90 ఏళ్ల వయసు గల వృద్ధుడు దూదారి సుబ్రమణ్యం పసరుతిత్తిలో రాళ్ళు జారి పసరు నాళంలో పడడంతో తీవ్రమైన అజీర్తి సమస్యతో కొంత అస్వస్థతకు గురై తమను సంప్ర దించారన్నారు. కుటుంబ సభ్యుల అనుమతితో ఇఆర్‌సిపి ఎండోస్కోపి శస్త్రచికిత్స విజయ వంతంగా నిర్వహించి రోగికి ఉపశమనం కల్పించామన్నారు. కామెర్లు, అజీర్తి సమస్యలతో బాధపడే వారు అపోహలు వీడి వయసుతో నిమిత్తం లేకుండా గర్భిణీలు సైతం ఎండోస్కోపి ద్వారా రేడియేషన్ లేని శస్త్ర చికిత్స వంటి అధునాతన సేవలు తమ హాస్పిటల్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. హైదరాబాద్, విజయవాడ, గుంటూరు వంటి మహా నగరాలకు ధీటుగా నరసరావుపేట పట్టణంలోని తమ హాస్పిటల్‌లో అన్ని వర్గాల ప్రజలకు అందుబాటు ధరలలో మెరుగైన వైద్య సేవలు 24 7 అందుబాటులో ఉన్నాయన్నారు.

ప్రారంభానికి నోచుకోని

ఈ - హెల్త్, వెల్ నెస్ కేంద్రాలు



దొండపాడు లో ప్రారంభానికి నోచుకోని అంగన్ వాడీ కేంద్రం

ప్రజాశక్తి - తుళ్లూరు

అమరావతి రాజధాని గ్రామాల్లో నిర్మించిన ఈ - హెల్త్,వెల్ నెస్ సెంటర్లు, పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలను ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. రాజధాని అమరావతిని స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయడానికి ఎంపిక చేయడంతో సిటీ ఇన్వెస్ట్ మెంట్ టు ఇన్నోవేట్ ఇంటిగ్రేటెడ్ అండ్ సస్టైన్(సిఐటిఐ ఐఎస్) ప్రాజెక్ట్ కింద రూ 138.62 కోట్లతో రాజధాని గ్రామాల్లో 16 ఈ - హెల్త్ సెంటర్లు, 17 మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలు, 14 పాఠశాలలు నిర్మాణాలకు ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్ మెంట్ అథారిటీ (ఏపి సి ఆర్ డి ఎ) ఈ - హెల్త్,వెల్ నెస్,అంగన్వాడీ కేంద్రాలు, స్కూళ్ల నిర్మాణం కోసం రూ 40 కోట్లు కేటాయించింది. వ్యాధులు రాకుండా ముందుగానే ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించడంతో పాటు వ్యాధి బారిన పడ్డాక వైద్యం అందించడం ఈ - హెల్త్, వెల్ నెస్ కేంద్రాల ఉద్దేశం.ప్రాథమిక ఆరోగ్య తనిఖీలు,రోగనిర్ధారణ,వైద్య సేవలతో పాటు సామాజిక, మానసిక ధృఢత్వం పెంపొందించేందుకు వ్యాయామాలు చేయడం కోసం సౌకర్యాలు సదరు కేంద్రాల్లో ఉంటాయి. రాయపూడి, తుళ్లూరు, మల్కాపురం, దొండపాడు, బోరుపాలెం, శాఖమూరు తదితర గ్రామాల్లో ఈ - హెల్త్,వెల్ నెస్ కేంద్రాల నిర్మాణం పూర్తయ్యి ఏళ్ళు గడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు. రాయపూడి, వెంకటపాలెం, మందడం, దొండపాడు, అనంతవరం గ్రామాల్లో నిర్మించిన అంగన్వాడీ కేంద్రాలది కూడా అదే పరిస్థితి. దీంతో అవి అలంకార ప్రాయంగా మారాయి. రాయపూడిలో రూ 148.12 లక్షలు, తుళ్లూరులో రూ కోటి 13 లక్షల 48వేలతో ఈ - హెల్త్,వెల్ నెస్ కేంద్రాలు నిర్మించారు.భవనాలు నిర్మించి ప్రారంభం మరిచారని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. భవనాల నిర్మాణంలో ఉన్న శ్రద్ధ వాటి ప్రారంభం,వైద్యులు, సిబ్బంది నియామకంలో ఉండడం లేదన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి.రాజధాని గ్రామాల్లోని రైతులు,ఇతరులు నిర్మాణాలు పూర్తయిన భవనాలను ప్రారంభించి అవసరమైన సిబ్బందిని నియమించాలని సిఆర్‌డిఎ అధికారులకు చాలా సార్లు విజ్ఞప్తి చేశారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ - హెల్త్, వెల్ నెస్, అంగన్వాడీ కేంద్రాలు,పాఠశాల లను త్వరితగతిన ప్రారంభించాలని కోరుతున్నారు.

తక్షణమే ప్రారంభించాలి..



రాజధాని గ్రామాల్లో లక్షలాది రూపాయలతో నిర్మించిన ఈ - హెల్త్,వెల్ నెస్ సెంటర్లు, అంగన్ వాడీ కేంద్రాలు,పాఠశాలను వెంటనే ప్రారంభించాలి. రాజధానిలో స్థానికులతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులకు వైద్య సలహాలు, సౌకర్యాల కల్పనకు, ఈ - హెల్త్ సెంటర్ల అవసరం ఉంటుందని చెప్పారు.కార్మికుల పిల్లలకు విద్యను అందించేందుకు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు సాయ పడతాయని, తక్షణమే వాటిని ప్రారంభించాలి, ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగింది.

- ఎం.రవి..సిపిఎం రాజధాని డివిజన్ కార్యదర్శి

ఏళ్లుగడుస్తున్నా ప్రారంభానికి నోచుకోలేదు..



తుళ్లూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద లక్షల రూపాయల వ్యయంతో ఈ - హెల్త్,వెల్ నెస్ కేంద్రంను నిర్మించారు. ఇదిగో..అదిగో అంటూ హడావిడి తప్ప ఏళ్లుగా ప్రారంభం చేయడం లేదు. ఈ - హెల్త్,వెల్ నెస్ సెంటర్ నిర్మాణం ఉద్దేశం ఏంటో.. ఎలాంటి సేవలు అందుతాయో కూడా తెలియడం లేదు.

- మేరిగ నాగేశ్వరరావు, తుళ్లూరు

యురియా, డిఎపి రైతులకు అందుబాటులో ఉంచాలి

సిపిఎం నాయకులు
ములకా శివ సాంబిరెడ్డి




పొలాలను పరిశీలిస్తున్న జిల్లా కౌలు రైతు సంఘం నాయకుడు ములకా శివసాంబిరెడ్డి

ప్రజాశక్తి - కొల్లిపర

వర్షాలు లేక కొన్నాళ్లు అధిక వర్షాలతో మరికొన్నిసార్లు ఎరువులు దొరకక మరికొన్ని సార్లు ఇబ్బంది పడుతున్నామని అత్తోట యాదవపాలెం రైతులు ఆవేదన వెలిబుచ్చారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులుములకా శివ సాంబిరెడ్డి రైతులతో కలిసి మూడోసారి వెదబెట్టిన వరి పొలాలను పరిశీలించారు. సర్పంచ్ దేశ బోయిన నాగ పుణేశ్వరరావు మాట్లాడుతూ తమ గ్రామంలో 1000 ఎకరాలు వరి పొలాలని రెండుసార్లు వెద పెట్టామని ఇప్పుడు 100 ఎకరాలు మూడోసారి వెద పెట్టాల్సింది వచ్చిందని పేర్కొన్నారు. వ్యవసాయం తప్ప మరొకటి చేతకాని రైతులకు ప్రభుత్వం సాయం అంతంత మాత్రంగానే ఉందని పేర్కొన్నారు. యూరియా డిఏపి అందుబాటులో లేక పోవడంతో కృష్ణా జిల్లా వెళ్లి అధిక ధర పెట్టి తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిం దన్నారు. కుర్ర కోటేశ్వరరావు దేశ బోయిన సోమయ్య శ్రీనివాసరావులు మాట్లాడుతూ 2004 లో ధాన్యం బస్తా 1600 కి అమ్మినట్లు తెలిపారు. ప్రస్తుతం ఎరువులు విత్తనాలు పురుగు మందులు డీజిల్ కూలి రేట్లు పెరిగి వ్యవసాయం గిట్టుబాటు కాకపోయినా ఇప్పుడు కూడా ధాన్యం బస్తా 1600కే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. శివ సాంబిరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎరువులుపై సబ్సిడీ తగ్గించేసిందన్నారు కౌలు రైతులకు బ్యాంకు రుణాలు అందక పోవడంతో వ్యవసాయం కష్టంగా మారిందని కౌలు రైతులు ఆవేదన వెలిబుచ్చారన్నారు ఈ సమస్యపై రైతులు ఉద్యమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

అమరావతిలోని సీడ్ యాక్సెస్ రోడ్డులో మాక్ డ్రిల్





జాగిలాలతో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు, సీడ్ యాక్సెస్ రోడ్డులో మాక్ డ్రిల్ నిర్వహణ

ప్రజాశక్తి - తుళ్లూరు

జిల్లా ఎస్‌పి సతీష్ కుమార్ ఆదేశాల మేరకు రాజధాని అమరావతి లోని సీడ్ యాక్సిస్ రోడ్డులో ఆదివారం భద్రత ప్రమాణాల సమీక్ష కోసం ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించారు. మాక్ డ్రిల్‌లో గుంటూరు జిల్లా భద్రతా విభాగం ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ సంయుక్త ఆధ్వర్యంలో వివిఐపి, విఐపిలు ప్రయాణించే రహదారిలో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచే విధంగా వివిధ భద్రతా చర్యలను అభ్యాసం చేయడం జరిగింది. ఎస్ఎస్ జిఎస్‌పి, అదనపు ఎస్‌పిలు, తుళ్లూరు డి ఎస్ పి మురళీ కఅష్ణ, జిల్లా ఎఆర్‌డిఎస్‌పి ఏడుకొండలరెడ్డి, ఎస్ఎస్ జిబిడి టీం డిఎస్ పి రామకృష్ణ ఇతర భద్రతా అధికారులు హాజరై భద్రతా సిబ్బంది చేసిన మాక్ డ్రిల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని సూచించారు. మాక్ డ్రిల్‌లో భాగంగా ఆధునిక సాంకేతిక భద్రతా పరికరాలు, శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలను వినియోగించి మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమం నుండి ఎన్ 9 జంక్షన్ వరకు సీడ్ యాక్సెస్ రోడ్డులోని డివైడర్లు, చెట్ల పొదలు, వంతెనలు, కల్వర్టులు, తూములు తదితర ప్రదేశాలను పూర్తిగా తనిఖీ చేశారు. భద్రతా సిబ్బంది తనిఖీల కచ్చితత్వాన్ని నిర్ధారించడానికి పలు భద్రత తనిఖీల అభ్యాసాలు నిర్వహించడం జరిగింది. ఎస్ఎస్‌జి ఎస్‌పి భద్రయ్య మాట్లాడుతూ వివిఐపిలు, విఐపిలు ప్రయాణించే సీడ్ యాక్సిస్ రోడ్డులో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచడమే లక్ష్యంగా మాక్ డ్రిల్ నిర్వహించామని తెలిపారు. అనుకోని సంఘటనలు సంభవించినపుడు భద్రతా సిబ్బంది ఎలా స్పందించాలి? అనుమానితులు, అనుమానిత వస్తువులు (పేలుడు పదార్థాలు) కనుగొన్నప్పుడు ఏ విధంగా వ్యవహరించాలి? అనే అంశాలపై అభ్యాసం చేయడం జరిగింది అన్నారు.బిడి బృందం గుంటూరు జిల్లా భద్రతా విభాగ సిబ్బంది అన్ని ప్రదేశాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారని, వారి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అదనపు ఎస్ పి లు మాట్లాడుతూ సీడ్ యాక్సెస్ రహదారిపై ఎటువంటి సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. బిడి బీందం ప్రత్యేక దళం (ఎస్‌టి ఎఫ్) సమన్వయంతో సీడ్ యాక్సెస్ రోడ్డు, పరిసర ప్రాంతాల్లో నిరంతరం తనిఖీలు కొనసాగిస్తు న్నామని చెప్పారు. సిసి కెమెరాలు, డ్రోన్ కెమెరాల సహాయంతో పర్యవేక్షణను బలోపేతం చేశామని తెలిపారు. రాజధాని ప్రాంతంలో వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన కార్మికుల వివరాలు సేకరించి వారి కదలికలపై నిఘా ఏర్పాటు చేసినట్లు వివరించారు.




దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

264వ రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు ఆదివారం నాటికి 264 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఎం.శారద, నవనీతం, డి.రమణ, ఎన్.సుబ్బారావు, అంకారావు కూర్చున్నారు. యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ దీక్షను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమైన కార్మికుల సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని చెప్పారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సూర్య ప్రకాష్, డి.నాగేశ్వరరావు, తుపాకుల నాగేశ్వరరావు, దుర్గమ్మ, దుర్గ భవాని, ఇమాంబి, ఇస్మాయిల్, శారద, తదితరు పాల్గొన్నారు.



తగ్గిన వరద నీటి ప్రవాహం

కృష్ణా నదికి తగ్గుతున్న వరద

ప్రజాశక్తి - తాడేపల్లి

రెండు రోజుల నుండి కృష్ణా నది వరద నీరు తగ్గుముఖం పట్టింది. ఆదివారం 3 లక్షల 80 వేల క్యూసెక్కులు వరద నీరు బ్యారేజ్ వద్దకు వచ్చి చేరుతుంది. అదే నీటిని బ్యారేజీ దిగువకు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. వంటకాలవులకు 8000 క్యూసెక్కులు నీటిని వదులుతున్నట్టు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. నదిలోకి చేపల వేటకు వెళ్ళవద్దని మత్స్యకారులకు తాడేపల్లి ఎంఆర్‌ఓ డి.సీతారామయ్య సూచించారు. కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఇబ్బందికరమైన పరిస్థితిలేమీ లేవని, అయినా అప్రమత్తత అవసరమని, సాయం అందించడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారని ఆయన చెప్పారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలకు సాదియా

ప్రజాశక్తి - మంగళ గిరి



మంత్రి లోకేష్‌తో పవర్ లిఫ్టర్ సాదియా ఆల్మాస్

ఈనెల 24వ తేదీ నుండి సెప్టెంబర్ నెల 3వ తేదీ వరకు కోస్తారికా రాజధాని శాంన్ జోస్‌లో జరిగే వరల్డ్ సబ్ జూనియర్ & జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొనే పవర్ లిఫ్టింగ్ ఇండియా టీమ్‌లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన అంతర్జాతీయ మహిళా పవర్ లిఫ్టర్ షేక్ సాదియా ఆల్మస్ ఆదివారం ముంబై నుంచి బయలుదేరి వెళ్లినట్టు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, ప్రధాన కార్యదర్శి షేక్ సంధాని తెలిపారు. సాదియా ఆల్మస్‌కు మంగళగిరి ఎమ్మెల్యే మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ & విద్యాశాఖ మంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ నారా లోకేష్ తన సొంత నిధులతో ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో 2,50,000/-ఆర్థిక సహాయం అందించారు. ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి నారా లోకేష్‌కి గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్, రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ మరియు క్రీడాకారిని సాదియా అల్మస్, షేక్ సంధాని తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. దేశానికి రాష్ట్రానికి, గుంటూరు జిల్లాకు, మంగళగిరికి మంచి పేరు తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గంటా వెంకటేశ్వరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, సౌత్ ఇండియా మరియు ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సకల కోటేశ్వరరావు, గుంటూరు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ వైస్ చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ, ఆకాంక్షించారు.



గోదాములను పరిశీలిస్తున్న అధికారులు

ఎరువుల గోదాము పరిశీలన

ప్రజాశక్తి - నాదెండ్ల

ఎరువుల గోదాములను గుంటూరు ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు పరిశీలించారు. గణపవరం గ్రామంలో ఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో ఉన్న ఎరువుల గోదాములను ఆదివారం రీజినల్ విజిలెన్స్, ఎన్ ఫోర్సుమెంట్ గుంటూరు అధికారులు సిఐ, కె. చంద్రశేఖర్, ఏవో ఆదినారాయణ స్థానిక మండల వ్యవసాయాధికారి టి. శ్రీలతతో కలిసి తనిఖీ చేశారు. భౌతిక నిల్వలు, బుక్ బ్యాలెన్స్ ఆన్‌లైన్ నిల్వలను పరిశీలించారు. అన్ని సరిగా ఉన్నవని ధృవీకరించారు. ఎరువుల దుకాణా దారులు ఎంఆర్‌పి కంటే ఎక్కువకు ఎరువులు అమ్మినా, కృత్రిమ కొరత సృష్టించిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.




సుబ్బారెడ్డికి నివాళి అర్పిస్తున్న గజ్జల సుధీర్ భార్గవరెడ్డి

కొమ్మారెడ్డి సుబ్బారెడ్డికి నివాళి

ప్రజాశక్తి-సత్తెనపల్లి

ముప్పాళ్ళ మండలం దమ్మలపాడు గ్రామానికి చెందిన కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సత్తెనపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ రెడ్డి దమ్మలపాడు గ్రామంలోని సుబ్బారెడ్డి నివాసానికి వెళ్లి సుబ్బారెడ్డి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ మారురి పద్మావతి రామలింగారెడ్డి (చిన్న), నాయకులు కళ్ళం శివరామిరెడ్డి,చావ రమేష్, బదిగం సాయికిరణ్ రెడ్డి, అన్నపురెడ్డి శివారెడ్డి, చామలఅర్జున్ రెడ్డి, కోట్ల శివారెడ్డి, బదిగం రాజగోపాల్ రెడ్డి, కొమ్మారెడ్డి సాంబిరెడ్డి ఉన్నారు.



లాంచీలో సందడి చేస్తున్న పర్యాటకులు

నాగార్జునకొండలో పర్యాటకుల సందడి

లాంచీ స్టేషన్ ఆదాయం రూ.1,74,700

ప్రజాశక్తి - విజయపురిసౌత్

నాగార్జున కొండలో ఆదివారం పర్యాటకులు సందడి చేశారు. పర్యాటకులు నాగసిరి, శాంతిసిరి, అగస్త్య లాంచీలలో నాగార్జున కొండకు వెళ్లారు. కొండలోని మ్యూజియంలో ఉన్న బుద్ధుని పతిమలు, రాతి పనిముట్లు, మట్టి కుండలు, తొమ్మిది అడుగుల బుద్ధుని పాలరాతి విగ్రహం, మహాస్తూపం, అశ్వమేధ శాల, స్నానాల గట్టు, బోధివృక్షం చూసి తన్మయం చెందారు. అనంతరం పచ్చని కొండల మధ్య ఉన్న అనుపు, యాంపి స్టేడియం, అశ్వమేధ యగ్నశాల, శ్రీ రంగనాథస్వామి దేవాలయం, తదనంతరం 60అడుగుల ఎత్తునుండి జాలువారే ఎత్తిపోతల జలపాతాన్ని తిలకించారు. లాంచీల ద్వారా రూ. 1,74,700 ఆదాయం పర్యాటక శాఖకు సమకూరినట్లు లాంచీ యూనిట్ అధికారులు పేర్కొన్నారు.



బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ నిర్వహిస్తున్న ర్యాలీ

బాల్య వివాహాలు చేస్తే చర్యలు

జడ్జి శ్రీనివాస కళ్యాణ్

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు మండల న్యాయ సేవ కమిటీ మాచర్ల ఆధ్వర్యంలో ఆదివారం మాచర్ల పట్టణంలోని శ్రీశైలం రోడ్డులోని ఎరుకల కాలినీలో బాల్యవివాహాలు, ముందస్తు గర్భధారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల న్యాయసేవా కమిటీ చైర్మన్ శ్రీనివాసకళ్యాణ్ హాజరై మాట్లాడుతూ బాల్య వాహాలు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివాహాలకు పెద్ద మనుషులుగా వ్యవహరించినా, ఆయా కార్యక్రమాలు నిర్వహించినా, తల్లిదండ్రులైనా బాధ్యత వహించాల్సి ఉంటుం దని తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ బంగ లక్ష్మీప్రసన్న మాట్లాడుతూ చిన్న వయసులో వివాహాలు జరిపితే అనేక శారీరక, మానసిక సమస్యలు ఎదురవుతాయని, బాలికలో పిండం సరిగా అభివృద్ధి చెందక అంగవైకల్యంతో పిల్లలు జన్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వై రమేష్ బాబు, కార్యదర్శి అనిల్ కుమార్, న్యాయవాది షేక్‌ఖాసీం, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది మండల న్యాయ సేవ కమిటీ సభ్యులు మెట్టు గోవింద రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎరుకల కాలనీలో బాల్య వివాహాలను వ్యతిరేకిస్తూ ర్యాలీ నిర్వహించారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం

కమిషనర్ వేణుబాబు

ప్రజాశక్తి - మాచర్ల

చెత్తా చెదారాన్ని ఎక్కడపడితే అక్కడ పడేయకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ డి. వేణుబాబు అన్నారు. ఆదివారం మాచర్ల పట్టణంలోని రామాటాకీస్ వీధిలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను, కమిషనర్ డి. వేణుబాబు పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు సలహాలు ఇచ్చి, పరిశుభ్రతపై మరింత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కమిషనర్ మాట్లాడుతూ మాచర్ల మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్యానికి ప్రథమ ప్రాధాన్యతను ఇస్తున్నట్లు తెలిపారు. వ్యాపారస్తులు, పట్టణ ప్రజలు పారిశుద్ధ్యంపై మున్సిపల్ కార్మికులకు సహకరించాలన్నారు.



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వేణుబాబు

తమషాపులు, ఇండ్ల ముందు చెత్తాచెదారం వేయకుండా మున్సిపల్ వారు సూచించిన డస్ట్ బిన్లలో కానీ, తమ కార్మికులకు కానీ అందజేయాలన్నారు. పట్టణ పరిశుభ్రత పట్టణ పౌరులుగా మనందరి బాధ్యత అని స్పష్టం చేశారు. కమిషనర్ వెంట సానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజా తదితరులు ఉన్నారు.



ఫొటో గ్రాఫర్లకు సన్మానం చేసిన రోటరీ క్లబ్ సభ్యులు

ఫొటోగ్రాఫర్లకు అభినందనలు


ప్రజాశక్తి - వినుకొండ

ఆర్ట్ ఫొటోగ్రఫీలో అంతర్జాతీయంగా రాణిస్తున్న వినుకొండ ఫొటోగ్రాఫర్ మిత్రులకు అభినందనలు తెలుపుతూ వారు పోటీలకు వెళ్లడానికి అవసరమైన ప్రాథమిక వసతులను సమకూర్చడానికి రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ సదా సిద్ధంగా ఉంటుందని క్లబ్ అధ్యక్షుడు ఏరువ వెంకటనారాయణ అన్నారు. 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక ఎన్‌జిఒ హోంలో ఫొటోగ్రాఫర్ మిత్రులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆత్మీయ సత్కారాలు నిర్వహించారు. జాతీయంగా, రాష్ట్ర స్థాయిలోను ఉత్తమ ఫొటోగ్రాఫర్‌లుగా అవార్డులు సాధించిన వంగపల్లి బ్రహ్మయ్య, కేసనపల్లి సుబ్బారావుతో పాటు సీనియర్ ప్రెస్ ఫొటోగ్రాఫర్ కోకా సుబ్బారావు, వర్ధమాన ఫొటోగ్రాఫర్లు పాపగంటి వినీల్, గోళ్ల మల్లికార్జునలను సత్కరించారు. క్లబ్ కార్యదర్శి ఎస్.కె. బాజీ, కోశాధికారి పి.నవీన్, క్లబ్‌జిల్లా ముఖ్యులు ఆలా సి.శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ఎం.గిరిబాబు. నాగేందడు మాష్టారు ప్రసంగించారు. క్లబ్ మాజీ అధ్యక్ష, కార్యదర్శులు గుమ్మా శ్రీకాంత్ రెడ్డి, గుత్తా గురునాథం, క్లబ్ డైరెక్టర్లు షేక్‌మస్తాన్, ఎం.హను మంతరావు, క్లబ్‌మాజీ కోశాధి కారి షేక్ నాయబ్ రసూల్, క్లబ్ సభ్యులు జి. కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి-ముప్పాళ్ళ

మండలంలోని మాదల గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద సత్తెనపల్లి సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో సింగరాజు చారిటబుల్ ట్రస్టు సౌజన్యంతో ఆదివారం ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ మెగా వైద్యశిబిరంలో సాయికృష్ణ మల్టీ స్పెషాలిటీ మేనేజింగ్ డైరెక్టర్ ఊపిరితిత్తుల వైద్యనిపుణులు డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, జనరల్ మెడిసిన్ వైద్య నిపుణులు డాక్టర్ సింగరాజు విద్య, గుంటూరు కిమ్స్ శిఖర హాస్పిటల్ కు చెందిన ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ ఆకుల శివప్రసాద్ ఈ శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందజేశారు. వైద్య శిబిరంలో సుమారు 250మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సింగరాజు సాయికృష్ణ మాట్లాడుతూ ఉచిత మెగా వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించిందని గ్రామీణ ప్రాంతాలలో జరిగే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాదల గ్రామంలో ఇటీవల ఆటో బాషా కూతురికి జన్మిం చిన పసిబిడ్డకి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ సాయికృష్ణ

గుండెకు సంబంధించిన ఆపరేషన్ జరిగిందని తెలుసుకొని వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి చిన్నారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. పసిబిడ్డ త్వరగా కోలుకొని ఆరోగ్యంగా ఉండాలని, నెల నెల వైద్యానికి అయ్యే మందుల ఖర్చుకు ఆర్థికంగా సహాయం చేస్తానన్నారు. కార్యక్రమంలో మాదల గ్రామ ఉపసర్పంచ్ తిరుమల శెట్టి సైదబాబు, కూటమి నాయకులు రావిపాటి మధు బాబు, రావిపాటి బసవయ్య, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి గోపి, ఉగ్గం యలమంద, మర్రిపూడి రమేష్, జవ్వాజి శేషు,ముత్తినేని నరేంద్ర, ప్రవీణ్, కామేపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి ... పరిస్థితి విషమం

ప్రజాశక్తి - బెల్లంకొండ

బెల్లంకొండ మండలం చంద్రాజుపాలెం గ్రామంలో బావపై బామ్మర్ది జరిగిన ఘర్షణలో హనుమంతురావుపై దాడి జరిగింది. ఆదివారం ఉదయం మద్యం సేవించి ఉన్న హనుమంతురావుని బావమరిదిని శీను అడవిలోకి తీసుకెళ్లి విచక్షణారహితంగా దాడి చేశాడని అతడి అన్న ఆంజనేయులు తెలిపారు. దాడిలో స్పృహ కోల్పోయిన హనుమంతరావును బంధువుల సహాయంతో సత్తనపల్లి ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితి



చికిత్స పొందుతున్న హనుమంతరావు

విషమంగా ఉందని బంధువులు తెలిపారు. జరిగిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

గందరగోళంలో పింఛను దారులు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

తాత్కాలిక సదరన్ ధ్రువపత్రాలపై దివ్యాంగులకు ఆరోగ్య పింఛన్ పొందే అర్హులకు ఎప్పటిలాగే పింఛన్ ఇవ్వాలని ఇచ్చిన నోటీసులను వెనక్కి తీసుకోవాలని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పినా ఏ అధికారీ ఖేతార్ చేయటం లేదని సిపిఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక పండరీపురంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడు తూ కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే వికలాంగుల పెన్షన్లు పెంచడం ద్వారా మా ప్రభుత్వం మంచి ప్రభుత్వమని చెప్పి పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోందన్నారు. మండల స్థాయిలో షుమారుగా 950 పింఛన్లను కోత విధించిందన్నారు. ఈ ప్రభుత్వం 13నెలల కాలంలోనే పింఛన్లకు కుదించే ప్రయత్నం చేయటం దుర్మార్గమన్నారు. చెవిటి, మూగ, గూని, వృద్ధులు, వికలాంగులు పెన్షన్ గత 20, 23సంవత్సరాలుగా తీసుకున్న వారికి ఒక్కసారిగా ఆగిపోవటంతో గందరగోళ పరిస్థితిలో ఉన్నా రన్నారు. గత ప్రభుత్వంలో అర్హులు ఇపుడు ఎందుకు కారని ప్రశ్నించారు. ఇప్పటికైనా అర్హులను గుర్తించి పింఛన్లు తక్షణమే పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సిపిఎం వాళ్లకు అండగా ఉండి పోరాడుతుందని హెచ్చరించారు.

గ్రామాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు కీలకం

ప్రజాశక్తి - వినుకొండ

గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ, పీఎంపీ సేవలు కీలకమని ప్రభుత్వ చీఫ్‌విప్ వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. వినుకొండ పట్టణంలో గంగినేని కళ్యాణ మండపంలో ఆర్ఎంపి, పిఎంపి, పట్టణ గ్రామీణ వైద్యుల ఐక్య వేదిక సంక్షేమ సంఘం రాష్ట్ర మహాసభలో ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ సమాజానికి గ్రామీణ వైద్యులు అందిస్తున్న సేవలు విలువైనవని కొనియాడారు. గ్రామ ప్రజలకు తక్షణ వైద్యసాయం అవసరమైనపుడు ప్రాథమిక వైద్య సహాయం అందాలన్నారు. అందుకోసమైనా ఆర్ఎంపీ, పీఎంపీలకు శిక్షణ ఇచ్చి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జున రావు కూటమి నాయకులు పాల్గొన్నారు.



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - యడ్లపాడు

జిబిఆర్ ఫౌండేషన్ సహకారంతో.. బొసట ఆధ్వర్యాన ఆదివారం పోపూరి రామారావు విజ్ఞాన కేంద్రంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతం వంటి సమస్యలతో బాధపడుతున్న రోగులకు నిపుణులైన వైద్యులు పర్యవేక్షణలో వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, రెండు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. వైద్యులు గుంటుపల్లి దివ్యతేజ, గుంటుపల్లి భవ్యతేజ రోగులను పరిశీలించి, ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన ప్రయోజనకరమైన సూచనలు, సలహాలు అందించారు. శిబిరంలో మొత్తం 280 మంది రోగులు వైద్య సేవలు పొందారు. క్యాంపు విజయవంతం కావడంలో బొసట అధ్యక్షులు నూతలపాటి కాళిదాసు, కార్యదర్శి సామినేని శ్రీనివాస్, ట్రెజరర్ కేతా రామబ్రహ్మం, పోపూరి శ్రీనివాసరావు, రావూరి సురేష్, బచ్చు రాజేష్, గోనుగుంట్ల కిరణ్, ముత్తవరపు పవన్‌సాయి, ముత్తవరపు ధర్మ పర్యవేక్షించగా, నారాయణ హైస్కూల్ విద్యార్థి నులు వాలంటీర్లుగా పనిచేసి సేవా భావాన్ని ప్రదర్శించారు.

నేడు చేపల మార్కెట్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చిలకలూరిపేట

చిలకలూరిపేట పురపాలక సంఘ పరిధిలోని 21వ వార్డు గడియార స్తంభం వద్ద రూ.125 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న ఆధునిక చేపల మార్కెట్ (మోడరన్ ఫిష్ మా ర్కెట్) నిర్మాణానికి సోమవారం ఉదయం 8:00 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం జరగనున్నదని మున్సిపల్ కమిషన్ పి.శ్రీహరిబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నర్సరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవ రాయు లు, చిలకలూరి పేట శాసనసభ్యులు, శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు హాజరవు తారన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడికొండ

స్థానిక బండ్ల కోటేశ్వరరావు మిత్రమండలి సారధ్యంలో శంకర కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఆదివారం శ్రీ సత్య సాయి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరంలో కంటి పరీక్ష చేసి శుక్లము ఉన్నవారికి ఉచిత బస్సు సౌకర్యంతో సోమవారం ఆసుపత్రికి తీసుకుని వెళ్లి ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీ బండ్ల కోటేశ్వరరావు, డాక్టరః అనూష, కొలికపూడి రమేష్, షేక్ రఫీ, చింతల భాస్కరరావు, కొలతల ఏసుబాబు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




పడవల మహేష్ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఘనంగా పడవల మహేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పడవల మహేష్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు.ఆదివారం మంగళగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో పడవల యూత్ ఆధ్వర్యంలో పడవల మహేష్ జన్మదిన కేక్‌ను టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, మహేష్ చే కేక్ కట్ చేయించారు. తెలుగుదేశం పార్టీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్నంగి శివశేషగిరి రావు, షేక్ రియాజ్, వాసా పద్మ,కందుల నాగార్జున,కారంపూడి అంకమ్మరావు, మాజేటి సూర్య వేణుగోపాల కఅష్ణ శ్రేష్టి,డిడ్ల సత్యానందం, గాజుల శ్రీనివాసరావు, గుంటి నాగరాజు, మంచికలపూడి వైష్ణవి, మన్నెం రమేష్, కొదమల సురేష్, ఆకురాతి నాగేంద్రం, వాకా మాధవరావు, జొన్నాదుల బాలకృష్ణ, వింజమూరి చంద్రశేఖర్, ఈపూరి జయకృష్ణ, దేవరపల్లి మహేష్, మర్రి ఏసుబాబు, పిన్నబోయిన నరేంద్ర, పడవల మహేష్ యూత్ కమిటీ సభ్యులు, ఆయా వార్డుల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలో ఆదివారం నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమంలో మండల పరిధిలోని తెలుగుదేశం పార్టీ శ్రేణులు, సుదూర ప్రాంతాల నుంచి ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్.టి.రామారావు ఒక కులానికో, మతానికో, ప్రాంతానికి చెందిన వ్యక్తి కాదని, తెలుగు ప్రజల ఆత్మగౌరవం నిలపటానికి పార్టీ పెట్టి తెలుగువారి ఖ్యాతిని దశ దిశలా వ్యాప్తి చేశారన్నారు. ఈరోజు ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు మార్గదర్శి ఎన్.టి.రామారావు అన్నారు. దేశ రాజకీయాలలో ఎన్టీఆర్‌కు ముందు ఎన్టీఆర్ తర్వాత అనే విధంగా రాజకీయాలలో తనదైన ముద్రవేశారన్నారు. దేవుని స్వరూపంలో ఉన్న ఆయన నిలువెత్తు విగ్రహం తక్కెళ్ళపాడు గ్రామంలో ఆవిష్కరించుకోవడం శుభ సూచకం అని కొనియాడారు. అనంతరం సభా ప్రాంగణం వద్ద ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో వేలాదిమంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వలివేటి మురళీకృష్ణ, సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు నందిపాటి బసవయ్య గ్రామ సర్పంచ్ కూచిపూడి రత్నకుమారి దంపతులు, మండలంలోని పలు గ్రామాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు,కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.



రోడ్డుకి అడ్డంగా పడిన చెట్టు, జేసీబీతో తొలగిస్తున్న సిబ్బంది, గాయపడిన తమ్మ శంకర్

విరిగిన చెట్టు కొమ్మ... ట్రాఫిక్‌కు అంతరాయం

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఎప్పుడూ అత్యంత రద్దీగా ఉండే తెనాలి - విజయవాడ రహదారిపై స్థానిక కొత్త లాకుల వద్ద ఉన్న అయ్యప్ప స్వామి గుడి సమీపంలో ఆదివారం సాయంత్రం ఆకస్మాత్తుగా చెట్టుకొమ్మ విరిగి రోడ్డుపై పడింది. అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న తమ్మ శంకర్ అనే వ్యక్తి పై కొమ్మ భాగాలు పడటంతో అతనికి స్వల్ప గాయాలయ్యాయి. సాయంత్రం పూట కావటం వలన వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్నది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కొందరు ప్రయాణికులు ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ప్రయాణించారు. సకాలంలో స్పందించిన ట్రైనీ ఎస్ఐ హరికృష్ణ సిబ్బందితో వచ్చి విరిగిపడిన కొమ్మ జేసీబీతో తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

పాఠశాల విద్యార్థులకు టీకాలు

ప్రజాశక్తి - దుగ్గిరాల



టీకాలు వేస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది

రాష్ట్ర విద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సమక్షేమ శాఖ ఆదేశాలతో పిల్లల ఆరోగ్య సంరక్షణలో భాగంగా పాఠశాలలో విద్యార్థులకు టీకాలు వేసినట్లు డాక్టర్ ఐ.ఇంద్ర తెలిపారు. ఇంజక్షన్లు చేసే స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఈనెల 18 వ తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించామన్నారు. ఈస ందర్భంగా పీహెచ్సీ వైద్యురాలు డాక్టర్ ఐ.ఇంద్ర మాట్లాడుతూ పిల్లలు కంఠ సర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం లాంటి జబ్బుల బారిన పడకుండా డిపిటి వ్యాక్సిన్ ఇచ్చినట్లు తెలిపారు. పీహెచ్సీ పరిధిలోని పాఠశాలలో ఐదు నుండి ఏడు సంవత్సరాల మధ్య వయసు కలిగిన 192 మంది బాల బాలికలకు డిపిటి2 బూస్టర్ డోస్ వ్యాక్సిన్ ఇంజక్షన్లు చేశారు. 10 సంవత్సరాలునిండిన వారికి (టి డి - టేట్నెస్ మరియు డిఫ్తీరియా ఇన్ఫెక్షన్ రాకుండా వేసే వ్యాక్సిన్) టిడి 1,467 మందికి 16 సంవత్సరాలు నిండిన వారికి టిడి 2 , 339 మందికి ఈ వ్యాక్సిన్ ఇచ్చినట్లు తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బంది పాఠశాలలకు వెళ్లి విద్యార్థిని విద్యార్థులకు ఈ వ్యాక్సిన్లు వేస్తున్న వివరించారు.

ఐక్యంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న చందు సాంబశివరావు

ప్రజాశక్తి - మంగళగిరి

ఐక్యంగా ఉండి కాపు సామాజిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని జనసేన పార్టీ నాయకులు చందు సాంబశివరావు పేర్కొన్నారు. కాపు సంఘం మంగళగిరి నియోజకవర్గ అధ్యక్షులు తిరుమల శెట్టి కొండలరావు ఆధ్వర్యంలో కాపుల ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి రంగిశెట్టి ఫౌండేషన్ అధినేత రంగిశెట్టి రమేష్ అధ్యక్షత వహించారు. చందు సాంబశివరావు మాట్లాడుతూ కార్తీక మాసం సమీపిస్తున్న నేపథ్యంలో వన సమారాధనకు సమాయత్తమయ్యేందుకు మంగళగిరిలో ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు చెప్పారు. 2004 నుంచి కాపు సామాజిక వర్గం ఎన్నో సమస్యలను ఎదుర్కొంటూ వస్తోందని అన్నారు. ఓట్లు వేసి కూటమి పార్టీలకు అధికారాన్ని కట్టబెట్టిన విషయంలో కాపు సామాజిక వర్గం వారు కీలక పాత్ర పోషించినట్లు తెలిపారు. మంగళగిరి నియోజకవర్గంలో కాపు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటి విద్యాశాఖ మంత్రి స్థానిక ఎమ్మెల్యే నారా లోకేష్‌ల దృష్టికి తీసుకు వెళ్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీఎస్పీ రిటైర్డ్ ఆర్ఐ తాటి కృష్ణారావు నాయుడు, కాపు సంఘం నాయకులు మొహమాటం అనిల్, జొన్న రాజేష్, చవ్వాకుల కోటేష్ బాబు, సిగిరి శెట్టి రాజా రమేష్ వీరిశెట్టి వెంకటేశ్వరరావు కోలా సౌభాగ్యరావు సాదు చంద్రశేఖర్, కాపరౌతు సుందరయ్య, తమ్మెల శివకుమార్, బండారు నాగేశ్వరరావు, చందు సూర్య, అంకం బాబు తదితరులు పాల్గొన్నారు.

కెఎల్‌యులో అభ్యాస హ్యాకథాన్

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

కెఎల్ డీమ్డ్ యూనివర్సిటీలోని నైపుణ్య అభివఅద్ధి విభాగం ద్వారా, సిఎస్ఇ, ఇసిఇ, ఎఐ డిఎస్, సిఎస్ ఐటి, ఐఒటి విభాగాలలోని బిటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థుల కోసం రూపొందించబడిన ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాస చొరవ స్కిల్ పలావర్ కార్యక్రమం మొదటి దశను విజయవంతంగా ప్రారంభించినట్లు స్కిల్ డెవలప్ మెంట్ డీన్ డాక్టర్ ఎ.శ్రీనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్గదర్శక కార్యక్రమం హ్యాకథాన్‌లను స్పెషలైజేషన్ ఆధారిత ప్రొఫెషనల్ ఎలక్టివ్‌లు, పరిశ్రమలకు అవసరమైన స్కిల్ కోర్సుల విద్యా నిర్మాణంలోకి అనుసంధానిస్తుందని తెలిపారు. స్కిల్ పలావర్ అనేది విద్యార్థులలో స్వీయ-నిర్దేశిత అభ్యాసమని అన్నారు. ఈ కార్యక్రమాన్ని మూడు - దశల విధానం ద్వారా రూపకల్పన చేసినట్లు పేర్కొన్నారు. మొదటిది లెర్నాథాన్ - వాస్తవ ప్రపంచ సమస్య ప్రకటనలపై పరిశ్రమ నిపుణులతో ఇంటరాక్టివ్ సెషన్‌లు కాగా, రెండవది వర్చువల్ సమీక్ష - డొమైన్ నిపుణులచేత ఇన్-సెమిస్టర్ మూల్యాంకనం అని అన్నారు. మూడవది హ్యాకథాన్ , ఓపెన్ హౌస్ - తుది ఆన్‌సైట్ మూల్యాంకనంతో పాటు పరిష్కారాల ప్రదర్శన అని స్పష్టం చేశారు. ఈ హాకథాన్ కు పరిశ్రమ నిపుణులు క్లౌడ్‌క్యూ హక్ థాన్ నిపుణులు రెస్మెడ్ బెంగళూరు నుండి సీనియర్ డెవ్‌ఆప్స్ ఇంజనీర్ రుషి కేశ్వర్ రెడ్డి, సైబర్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ హ్యాకథాన్ నిపుణులు ఇండియన్ సర్వర్స్ సిఇఒ, ఎయిమర్ సొసైటీ అధ్యక్షుడు డి.సాయి సతీష్, డేటా ఆధారిత భావోద్వేగాల హాక్ థాన్ నిపుణులు న్యూఢిల్లీలోని మాంగోడిబి సీనియర్ కన్సల్టింగ్ ఇంజనీర్ ఆదిత్య దువా, గేమ్‌ఫోర్జ్ హాక్ థాన్ నిపుణులు తాలా ఎలెక్సీ టీమ్ లీడ్ శివ కిషోర్ ఎం, ఐఒటి ఫ్యూజన్ హ్యాక్ థాన్ నిపుణులు కె ఫిట్ టెక్నాలజీస్ లిమిటెడ్ సీనియర్ టెక్నికల్ లీడ్ ఎం ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ఛాన్సలర్ డాక్టర్ జిపిఎస్ వర్మ, ప్రో విసిలు డాక్టర్ వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు ఈ కార్యక్రమానికి మార్గదర్శకత్వం వహించారు.



పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు



పరీక్ష కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనివాసరావు

క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు

ప్రజాశక్తి - తెనాలి

పట్టణానికి చెందిన వాసవి క్లబ్ కైలాసగిరి ఆధ్వర్యంలో బోస్ రోడ్ లోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం హైదరాబాద్‌కు చెందిన బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పటల్ బృందం సహకారంతో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షా శిబిరం నిర్వహించారు. వాసవి క్లబ్ కైలాసగిరి జిల్లా గవర్నర్ రాక సందర్భంగా నిర్వహించిన శిబిరంలో పట్టణ ప్రజలు క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకుని, అనుభవజ్ఞులైన వైద్యుల సలహాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ పులికొండ శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గని శిబిరాన్ని ప్రారంభించారు. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాల ఎన్‌సిసి విభాగం విద్యార్థులు సేవలందించారు. కార్యక్రమంలో క్లబ్ ఆర్‌సి ఎం.గౌరీశంకర్, చార్టెడ్ ప్రెసిడెంట్ ఎస్.లక్ష్మీనారాయణ గుప్తా, ప్రెసిడెంట్ సిహెచ్.వెంకట శివప్రసాద్, సెక్రటరీ కొత్త మాసు వినోద్, ట్రెజరర్ సిహెచ్.రఘురాం గుప్తా, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



రంగా విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

రంగా విగ్రహాన్ని అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - మంగళగిరి

కైకలూరు నియోజకవర్గం కలదిండి మండలం సానా రుద్రవరం గ్రామంలో కొందరు దుండగులు మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని అపవిత్రం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ నాయకులు చందు సాంబశివరావు కోరారు. మంగళగిరిలోని నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ఉన్న రంగా విగ్రహానికి నాయకులు ఆదివారం మధ్యాహ్నం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా చందు సాంబశివరావు మాట్లాడుతూ సానా రుద్రవరం గ్రామంలో రంగా విగ్రహానికి పేడ కొట్టి అపవిత్రం చేశారని, ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా రంగా విగ్రహాలకు పాలాభిషేకాలు జరుగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగా మంగళగిరిలోను కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. కాపు సంఘం నియోజకవర్గ అధ్యక్షులు తిరుమల శెట్టి కొండలరావు మాట్లాడుతూ రంగా విగ్రహాన్ని అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏ రాజకీయ పార్టీ నేత విగ్రహం అయినా ఈ తరహా దుశ్చర్యలకు పాల్పడటం సరికాదని తెలిపారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు జారీ చేశారని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో పలువురు కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

అనుమతులు తప్పనిసరి

ప్రజాశక్తి - తాడికొండ

వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతులు తప్పనిసరి అని తాడికొండ సీఐ కె.వాసు సూచించారు. మండపాల అనమతుల కోసం ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సింగిల్ విండో విధానం అనుసరించాలని సూచించారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు ముందుగా కమిటీగా ఏర్పడి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా అనుమతులు పొందాలన్నారు. ఈ విధానంతో గణేష్ ఉత్సవాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనంకు అనుమతులు సులభంగా పొంద వచ్చున్నారు.పోలీసు శాఖ సూచనలు పాటించి వివాదరహిత ఉత్సవాలు జరుపుకోవాలని ఆయన సూచించారు.



ప్రహరీగోడను ప్రారంభిస్తున్న ఎంపి శ్రీకృష్ణదేవరాయలు, తదితరులు

సేవా సంస్థలను ప్రోత్సహించాలి

ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు

ప్రజాశక్తి - గుంటూరు

సమాజంలో అనాథలను, అభాగ్యులను, మానసిక వికలాంగులను ఆదుకుంటున్న కార్మెల్ సేవా సదన్ లాంటి సంస్థలను ప్రోత్సహించడం మనందరి కర్తవ్యమని నరసరావుపేటలోక్ సభ సభ్యులు లావు శ్రీకఅష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం గుంటూరులోని గోరంట్ల వద్ద కార్మెల్ సేవా సదన్ ప్రాంగణంలో జరిగిన ప్రహరీ గోడ ప్రారంభోత్సవం, సేవా సంస్థల ఆత్మీయ సమ్మేళనాన్ని లావు శ్రీకృష్ణదేవరాయలు ప్రారంభించారు. జనచైతన్య వేదిక రాష్ట్రఅధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో ఎంపి మాట్లాడుతూ కార్మెల్ సేవా సదన్ వ్యవస్థాపకులు జాక్ క్లమాకస్ (గోతాల స్వామి) గత మూడు దశాబ్దాలుగా పొన్నూరు పట్టణంలో 300 మంది మానసిక వికలాంగులైన మహిళలకు, గుంటూరులోని గోరంట్ల వద్ద 75 మంది మానసిక వికలాంగులైన పురుషులకు ఉచితంగా భోజన, వసతిలతోపాటు సేవలను అందించడం వారి నిస్వార్థ సేకు నిదర్శమన్నారు. బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి మాట్లాడుతూ కేరళలో జన్మించిన జాక్ క్లమాకస్ కార్మెల్ సేవా సదన్‌ను స్థాపించి దాదాపు 400 మంది మానసిక వికలాంగులకు అండగా నిలిచారన్నారు. గుంటూరు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర మాట్లాడుతూ శర్వాణి రెడీమిక్స్ అధినేత పెద్దిరెడ్డి గోపాల్‌రెడ్డి కార్మెల్ సేవా సదన్ ప్రహరీ గోడ నిర్మాణానికి దాదాపు పది లక్షలు రూపాయలు వెచ్చించడం హర్షణీయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మెల్ సేవా సదన్, బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి వంటి చేస్తున్న సేవలను ఆదర్శంగా తీసుకొని, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న వారు దాతృత్వం ప్రదర్శించాలని కోరారు. శర్వాణి ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గోపాల్‌రెడ్డి, జాక్ క్లమాకస్ (గోతాల స్వామి) మాట్లాడారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చైర్మన్ పావులూరి రమేష్, అమ్మానాన్న చారిటబుల్ ట్రస్ట్, కోవిడ్ ఫైటర్స్, రుద్రా చారిటబుల్ ట్రస్ట్, కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్, నేస్తం ఫౌండేషన్, రేట్ పేయర్స్ అసోసియేషన్, అభినందన ఫౌండేషన్, చైల్డ్ హార్ట్ ఫౌండేషన్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్, హ్యాపీ కేర్ ఓల్డేజ్ హెూమ్, బహుజన మహాసభ కేంద్రం, మాతృదేవోభవ సంస్థల ప్రతి విధులను సత్కరించారు.

జిల్లాకు జషువా పేరు పెట్టాలి

ప్రజాశక్తి - గుంటూరు



మాట్లాడుతున్న డొక్కా మాణిక్యవరప్రసాద్

గుంటూరు గానీ, పల్నాడు జిల్లాకు మహాకవి గుర్రం జాషువా పేరు పెట్టాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు, సాహితీ వేత్తలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఆదివారం గుంటూరు బ్రాడీపేట్‌లోని జాషువా విజ్ఞాన కేంద్రంలో సామాజిక రాజకీయ ఉద్యమ నాయకులు, కవులు, కళాకారులు, సాహితీ వేత్తలతో జాషువా జిల్లా సాధనకు మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. భౌగోళిక,సామాజిక, రాజకీయ, సాంస్కఅతిక అంశాలతోపాటు ప్రభుత్వ పాలనకు సౌలభ్యంతో జిల్లాల పునర్నిర్మాణం జరగాలని, గత ప్రభుత్వంలో జరిగిన పొరపాట్లను సరిచెయ్యాలనే ప్రభుత్వం జిల్లాల పునర్విభజన కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. కమిటీకి సమావేశం ప్రతిపాదనను అందిస్తామని డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. తెలుగు భాషకు జాషువా గొప్ప సేవ చేశారని, ఆయన గుంటూరు జిల్లాలో జన్మించటం జిల్లా ప్రజలకు గర్వకారణం అన్నారు. ఈ సందర్భంగా గుర్రం జాషువా జిల్లా సాధనకు డొక్కా మాణిక్య వరప్రసాద్ చైర్మన్‌గా, కొరివి వినయ కుమార్ కన్వీనర్‌గా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా సాధనకు అధికారులకు, ప్రభుత్వానికి విజ్ఞాపనలు, ర్యాలీలు నిర్వహించాలని నిర్ణయించారు. సమావేశంలో ప్రముఖ కవులు పాపినేని శివశంకర్, రాణి శివశంకర్ శర్మ, డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, ప్రముఖ విద్యావేత్తలు సుబ్రమణ్యం, కన్నా మాస్టరు, కె.ఉదయ భాస్కర్, హైకోర్టు న్యాయవాదులు చందువోలు శోభారాణి, ఎలీషా, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబట్టి.. టీచర్ కొలువు పట్టి

అడ్డంకులను దాటుకుంటూ కోరుకున్న ఉద్యోగానికి

ప్రజాశక్తి - గుంటూరు

ఉపాధ్యాయ వృత్తిలోకి వెళ్లాలని ఎన్నో ఏళ్ల నుండి ఎదరు చూస్తున్న అభ్యర్థులకు వారి కల సాకరం కాబోతుంది. మూడ్రోజుల క్రితం విడుదల చేసిన మెరిట్ జాబితాలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన అనేక మంది టీచర్ కొలువులు సాధించారు. గృహిణులు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు చేస్తున్న వారు, అనేక కష్టాలు ఎదుర్కొంటూ పరీక్షలకు సిద్ధం అయిన వారు ఉపాధ్యాయులు కాబోతున్నారు. గతంలో అనేక సార్లు రాసినా రాకపోవటంతో పట్టుదలతో చదివారు. 2018 నోటిఫికేషన్ తర్వాత ఏడేళ్లలో నోటిఫిషన్ లేదు. అయినా విశ్రమించకుండా చదివి కొలువు పట్టారు. జిల్లాలో వివిధ సబ్జెక్టులలో ఉత్తమ మార్కులు సాధించిన కొందరు అభ్యర్థుల వివరాలు..వారి మనోగతం.

ఒకేసారి 3 పోస్టులకు ఎంపిక



మొదటిసారి పరీక్ష రాసినా ఒకే నోటిఫికేషన్‌లో మూడు పోస్టులకు నాగశ్రీవల్లి ఎంపికవటమే కాకుండా రాష్ట్ర, జిల్లా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించింది.ఈమెది వెల్దుర్తి మండలం, ఎర్రబాలెం గ్రామం. 2022లో బి.ఈడి పూర్తి చేసింది. తండ్రి వెంకటకృష్ణారావు, తల్లి సుజాత, ఒక తమ్ముడు ఉన్నాడు. చదువుతున్నాడు. ప్రస్తుత డిఎస్సీలో శ్రీవల్లి పీజీటి గణితం 78.5 మార్కులతో స్టేట్ 2వ ర్యాంకు, టిజిటి గణితం 83.66 స్టేట్ 2వ ర్యాంకు, ఎస్.ఎ.గణితం 2వ ర్యాంకు.కొద్ది రోజులు కోచింగ్ తీసుకున్నా మిగిలిన రోజులు మొత్తం సొంత ప్రిపరేషన్‌పైనే ఆధారపడింది. బి.ఈడీ పూర్తి అవగానే పరీక్షలకు సిద్ధం అయ్యింది. జాతీయ స్థాయిలో, తెలంగాణాలో ఉపాధ్యాయ వృత్తికి సంబంధించిన అనేక పరీక్షలకు దరఖాస్తు చేసి, పరీక్షలు రాస్తుంది. ఈలోగా మన రాష్ట్రంలో డిఎస్సీ నోటిఫికేషన్ రావటంతో దరఖాస్తు చేసి, పట్టుదలతో చదివి మొదటి ప్రయత్నంలోనే మూడు పోస్టులకు ఎంపికైంది.

- ఆవుల నాగశ్రీవల్లి, ఎర్రబాలెం

సొంత ప్రిపరేషన్‌తో ఉద్యోగం



పెళ్లి అయిన తర్వాత డిగ్రీ, బి.ఈడి పూర్తి చేసింది. మొదటి విడతలోనే జిల్లా స్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించింది. భర్త ప్రోత్సాహంతో బి.ఇడి పూర్తి చేసి, డిఎస్సీకి సిద్ధమైనట్లు ఆమె తెలిపారు. ఎటువంటి కోచింగ్ లేకుండానే ఇంటివద్ద సొంత ప్రిపరేషన్‌తోనే స్కూల్ అసిస్టెంట్ సోషల్‌లో 81.50 మార్కులతో జిల్లా స్థాయిలో 8వ ర్యాంకు సాధించింది. చేబ్రోలు మండలం, కొత్తరెడ్డిపాలెంకు చెందిన ఐ.నీలిమ టెట్‌లోనూ 122.43 మార్కులు సాధించింది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. మహిదర్ పదవ తరగతి, స్నేహలత ఏడో తరగతి చదువుతున్నారు. భర్త జి.వెంకటేశ్వరరావు స్కూల్ అసిస్టెంట్ గణితం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

- ఐ.నీలిమ, ఎస్.ఎ, సోషల్ 8వ ర్యాంకు

సచివాలయం నుండి ఉపాధ్యాయ వృత్తిలోకి..



గుంటూరుకు చెందిన విజయ్‌కుమార్ సచివా లయం లో వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ సెక్రటరీగా నెహ్రూ నగర్‌లో పనిచేస్తున్నాడు. ఉపాధ్యాయ వృత్తిపై ఉన్న మక్కువతో ఉద్యోగం చేస్తూనే సొంత ప్రిపరేషన్‌తోనే డిఎస్సీకి సిద్ధమయ్యారు. 2011లో బి.ఈడి పూర్తి చేశారు. 2018లో టిజిటి పరీక్షల్లో 13వ ర్యాంకు వచ్చింది. పోస్టులు తక్కువగా ఉండటంతో అప్పట్లో పోస్టు రాలేదు. ప్రస్తుతం జిల్లా స్థాయిలో 79.27 మార్కులతో ఇంగ్లీషు స్కూల్ అసిస్టెంట్ 12 ర్యాంకు సాధించాడు. నాన్న లేరు. అమ్మ రమణకుమారి గృహిణి. భార్య చందన సచివాలయం ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రెటరీగా చేస్తున్నారు.

- ఆదిపూడి విజయ్‌కుమార్, ఎస్.ఎ.ఇంగ్లీషు 12వ ర్యాంకు

అక్కా, చెల్లి ఇద్దరూ ఉపాధ్యాయులే..



ఈమె స్కూల్ అసిస్టెంట్ గణితంలో 89.33 మార్కులతో స్టేట్ 6వ ర్యాంకు, జిల్లా మొదటి ర్యాంకు సాధించింది. టిజిటి 12వ ర్యాంకు వచ్చింది. ప్రస్తుతం సచివాలయంలో ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రెటరీగా పనిచేస్తున్నారు. డిఎస్సీ నోటిఫికేషన్ రావటంతో ఉద్యోగానికి సెలవు పెట్టి అవని గడ్డలో కోచింగ్ తీసుకున్నారు. అక్క ఫహీమా బేగం.2012 డిఎస్సీలో ఎస్‌జిటి సాధించింది. నాన్న డ్రైవింగ్ చేస్తారు. భర్త సయ్యద్ ఫిరోజ్‌భాషా సచివాలయంలో శానిటరీ సెక్రెటరీగా చేస్తున్నారు. ఫసీహా 2014లో బి.ఈడి పూర్తి చేసింది. 2018 నోటిఫికేషన్‌లో ఎస్.ఎ 1 మార్కు, ఎస్‌జిటి 1.5 మార్కుల తేడాతో ఉద్యోగం రాలేదు. వెంటనే సచివాలయ నోటిఫికేషన్ రావటంతో చదివి పోస్టు సాధించింది. ఇప్పుడు డిఎస్సీ కోసం సంవత్సరం నుండి పరీక్షకు సిద్ధమై రెండు కొలువులు సాధించింది.

- ఫసీహా బేగం, ఎస్.ఎ.గణితం మొదటి ర్యాంకు

జీవన విధానంలో మార్పులతో షుగరు వ్యాధి అదుపు

ఘనంగా ఎస్‌విఆర్ హాస్పిటల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి - గుంటూరు

షుగర్ వ్యాధి ప్రాణాంతకం కాదని, మనిషి జీవన విధానంలో మార్పుల ద్వారా దానిని అదుపులో ఉంచుకుంటూ నిండు నూరేళ్లు జీవించవచ్చని డాక్టర్ రామ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఎస్‌విఆర్ షుగర్ హాస్పిటల్ 30వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక రాజాగారితోట టీటీడీ కళ్యాణ మండపం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవం సందర్భంగా పేషెంట్లకు బీపీ, షుగర్, అధిక బరువు పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. డాక్టర్ రామ్‌కుమార్ మాట్లాడుతూ తన భార్య డాక్టర్ వి.కమల సహకారంతో షుగర్ వ్యాధి కారకాలపై లోతైన పరిశోధనలు చేస్తూ అంతర్జాతీయ స్థాయిలో సెమినార్ల ద్వారా అనేక దేశాల ప్రముఖ వైద్యులతో తన ఆలోచనలను పంచుకుంటూ గుర్తింపు పొందామన్నారు. తినే ఆహారం చిన్న ప్లేట్‌లో సగభాగం కూర, ఒక భాగం ముడి బియ్యం అన్నం గానీ, పుల్కాలు, మిల్లెట్స్ పదార్థాలు తీసుకుంటూ, రోజూ కొద్దిపాటి వ్యాయామం, మెడికేషన్, వైద్యుని సలహాలు, సూచనలు పాటించడం ద్వారా షుగర్ వ్యాధి ఉన్నా సాధారణ జీవితం గడపవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా పేషెంట్ల సమక్షంలో కేట్ కట్ చేశారు. రామ్‌కుమార్



కేక్ కట్ చేస్తున్న డాక్టర్ రామ్‌కుమార్ దంపతులు

దంపతుల్ని సత్కరించారు. కార్యక్రమంలో వైద్య దంపతులు వి.సురేష్ నీలిమ, డాక్టర్ పాపినేని శివశంకర్, సినీ రంగస్థల నటులు చిట్టినేని లక్ష్మీనారాయణ, పూజ, సత్యనారాయణ, సీతారామయ్య రెడ్డి, మల్లి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్‌లో న్యూరో సర్జరీకి రోబోటిక్‌ల పాత్ర కీలకం

ప్రజాశక్తి - గుంటూరు

భవిష్యత్‌లో న్యూరో సర్జరీకి రోబోటిక్‌ల పాత్ర కీలకంగా మార నుందని డాక్టర్ సోమశేఖర్ చెప్పారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో కె.ఎల్. యూనివర్శిటీ ప్రాంగణంలో ఆదివారం 'న్యూరో నెక్సస్ 2025' రాష్ట్రస్థాయి న్యూరాలజీ వైద్యవిద్యా సదస్సు నిర్వహించారు. సదస్సును ముఖ్య అతిథిగా ఆస్టర్ ఇండియా మెడికల్ అడ్వైజరీ బోర్డ్ చైర్మన్, ప్రముఖ సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ సోమశేఖర్, ఇండియన్ మెడికల్ అసోసి యేషన్ ఆంధ్రప్రదేశ్ చాప్టర్ అధ్యక్షులు డాక్టర్ గార్లపాటి నందకిషోర్, ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు ప్రారంభించారు. డాక్టర్ పోతినేని రమేష్‌బాబు మాట్లాడుతూ ఈ నిరంతర వైద్యవిద్యా కార్యక్రమాలలో



సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ నందకిషోర్ తదితరులు

ద్వారా వైద్యులలోని విజ్ఞానం ఒకరినొకరు పంచుకోవటం వల్ల రోగులకు ఆధునాతన వైద్యసేవలు అందుతాయని అన్నారు. డాక్టర్ సోమశేఖర్ మాట్లాడుతూ న్యూరో సర్జరీ విభాగంలో రోబోటిక్ పాత్ర రాబోయే రోజులలో మరింత కీలకంగా మారు తుందని, రోగులు ఈ విధానంలో త్వరిత గతిన కోలుకుంటారని చెబుతూ, త్వరలోనే ఆస్టర్ రమేష్ గ్రూప్ నందు న్యూరో రోబోటిక్ సర్జరీలను ప్రారంభిస్తు న్నామని తెలియజేశారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ప్రముఖ న్యూరాలజిస్టులు రిటైర్డ్ మేజర్ జనరల్ డాక్టర్ కుమారవేలు, డాక్టర్ హరిణి, డాక్టర్ లక్ష్మీఅనూష, డాక్టర్ ప్రశాంత్‌బాబు, డాక్టర్ రాజేష్, డాక్టర్ దీప్తి, న్యూరోసర్జన్లు డాక్టర్ అరుణ్, డాక్టర్ ధీరజ్, డాక్టర్ పృధ్వి రోగనిర్ధారణలో అవలంభించిన నూతన వైద్యవిధానాలను వివరించారు. సదస్సును ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ సుబ్బారాయుడు, సెక్రటరీ డాక్టర్ బి.సాయికృష్ణ, మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ డాక్టర్ బి.విద్యాసాగర్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి, దక్షిణ భారతదేశం నుంచి ప్రముఖ న్యూరో సర్జన్లు, న్యూరాలజిస్టులు ప్రసంగించారు.